జనరాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 23

పక్షపత్రిక

డిసెంబర్ 16-31, 2013



## మన కాలపు మహాత్ముడు మండేలా మరి లేడు !

# ప్రజా ఉద్యమాల బాటలో లోక్‌సత్తా పార్టీ



## ఉపాధి కోసం యువభేరి






## రోగాల పుట్టగా మున్సిపాలిటీలు శుద్ధిచేసిన మంచినీటి కోసం ఉద్యమించండి

## మద్యంపై సమరశంఖం పూరించండి



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక డిసెంబర్16-31, 2013

సంపుటి - 4 సంచిక - 23

## లోపలి పేజీల్లో...

మన కాలపు మహాత్ముడు - నెల్సన్ మండేలా ..........5

లోక్‌సత్తా ప్రజా ఉద్యమాల బాట..............8

ఆమ్ ఆద్మీ పార్టీ విజయం ......................16

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు............18

ఆంధ్రప్రదేశ్ విభజన - రాష్ట్రపతికి లేఖ ......20

స.హ. చట్టం అమలు ............................23

రహదారి భద్రత .................................27

జిల్లా వార్తలు .....................................29

# కొత్త రాజకీయానికి స్వాగతం-పాతకు చరమగీతం

## సంపాదకీయం

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఇందులో స్పష్టంగా కనిపించే కొత్తదనం ఢిల్లీ ఎన్నికల ఫలితాలు. సంప్రదాయ రాజకీయ పార్టీల మధ్యనే సాగుతున్న రాజకీయ పోరుకు ఆమ్ ఆద్మీ పార్టీ తెరదించి మూటకట్టింది. అవినీతి చుట్టూ అల్లుకున్న రాజకీయాన్ని ధనబలం, కండబలం చుట్టూ పాతుకుపోయిన రాజకీయాన్ని, అది సవాల్ చేసి విజయం సాధించింది. ఈ ప్రయోగానికి ఢిల్లీ అన్ని రకాలుగా అనువైనది కావడంతో అనూహ్య ఫలితాలను సాధించింది.

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ గత 15 ఏళ్లుగా పాలిస్తున్నది. ఇటీవల కాలంలో ఢిల్లీలో జరిగిన పరిణామాలు కాంగ్రెస్ పతనానికి, ఆమ్ ఆద్మీ విజయానికి దారులు వేశాయి. కామన్వెల్త్ క్రీడల అవినీతిలో కాంగ్రెస్ సర్కార్ బండారం బయటపడింది. నిర్భయ కేసులో రాజధానిలో పౌర రక్షణ సమస్య బహిర్గతం అయింది. సామాన్యుడిపై పెనుభారం మోపే ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీలు, నీటి కొరత దీనికి తోడయ్యాయి.

అవినీతికి వ్యతిరేకంగా అన్నాహజారే ఉద్యమానికి ఢిల్లీ కేంద్రం అయింది. నిర్భయ ఉదంతంలో ఢిల్లీ అట్టుడికింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఉద్యమాల నుండి పుట్టింది, పెరిగింది. ఢిల్లీ వాసుల అభిమానాన్ని చూరగొంది. ఈ ఉద్యమాల ప్రభావంతో కొత్త శక్తులు రాజకీయ రంగ ప్రవేశం చేశాయి.

ఈ ఎన్నికల్లో ఢిల్లీలో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. యువత, మధ్యతరగతి తగిన సంఖ్యలో పాల్గొని ఎన్నికల ఫలితాలను మార్చడంలో కీలకపాత్ర పోషించాయి. నగరాలలో ప్రారంభమైన ఈ నవచేతన కొత్త రాజకీయానికి శుభసూచకం. రాజకీయాలను నిరసిస్తూ, ఓటింగ్‌కు దూరంగా వుంటున్న మధ్యతరగతి రాజకీయ రంగప్రవేశం తొలి ఫలితాలను ఢిల్లీలో ఇచ్చింది. అలాగే యువత ఓటర్లుగా నమోదుకావడం దగ్గర నుండి, ఓటింగ్‌లో పాల్గొనడం దగ్గర నుండి కొత్త రాజకీయానికి ప్రచారకులుగా, వలంటీర్లుగా రంగప్రవేశం చెయ్యడం మనదేశ రాజకీయ భవిష్యత్తును మూల మలుపు తిప్పే ఆశాకిరణం కానుంది.. రాజకీయాన్ని మార్చడానికి యువత నడుం బిగిస్తే, మధ్యతరగతి సానుకూలంగా స్పందిస్తే సామాన్య ఓటర్లను ఎలా ప్రభావితం చెయ్యవచ్చునో ఈ ఎన్నికలు రుజువు చేశాయి. ఈ తరగతులను సంఘటిత పర్చడంలో, విశ్వాసాన్ని పాలు కొల్పడంలో ఆమ్ ఆద్మీ కృతకృత్యమైంది.

అలాగే ఎన్నికలలో దీటైన ప్రచారం చెయ్యడానికి తగిన ఆర్థిక వనరులు సమకూర్చడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చారు. అతి తక్కువ కాలంలో దాదాపు 25 కోట్ల రూపాయలను ఆమ్ ఆద్మీకి అందించారు. మీడియా తనవంతు ప్రచారాన్ని కల్పించింది. కొత్త రాజకీయం విజయం సాధిస్తుందన్న ధీమాని ఢిల్లీ ఎన్నికలు కలిగించాయి. దేశ వ్యాపితంగా యువత, మధ్యతరగతి రాజకీయ రంగ ప్రవేశం చేస్తే, మీడియా అందుకు దోహదం చేస్తే, ప్రజలు తగిన వనరులను అందించగలిగితే 2014లోనే దేశ రాజకీయాలలో అనూహ్య మార్పులు తథ్యం.◆

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : కె. శ్రీలత
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819,***
***23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# మన కాలపు మహాత్ముడు!

**ఆయన కేవలం 'నల్ల సూరీడు' కాదు.. వర్ణ వివక్షల్లో, జాత్యహంకారాల్లో కూరుకుపోయిన ప్రపంచ మానవాళికి మానవత్వం, సమానత్వం నేర్పించాలని తన జీవితాన్నే అంకితం చేసిన ప్రజాస్వామ్య దీప్తి! జాతుల పట్ల, తరతరాలుగా నిర్లజ్జగా సాగిపోతున్న అహేతుక వివక్షల పట్ల ఈ ప్రపంచపు దృక్కోణాన్ని మార్చటానికి.. అస్తవ్యస్తంగా, అపసవ్యంగా ఉన్న ఈ ప్రపంచ గమనంలో ఓ గొప్ప మార్పు తేవటానికి.. జాతి వివక్ష పోరాటయోధుడిగా అవతరించిన మన కాలపు మహనీయుడు!**

**సొంత గడ్డపై కనీస ఓటు హక్కుకు కూడా నోచుకోని నల్లజాతీయుల తరపున ఆయన సాగించిన పోరాటం అసమానం. శతాబ్దాల పాటు విద్వేష విషం చిమ్మిన తెల్ల పాలకుల ఏలుబడి నుంచి దక్షిణాఫ్రికాను విముక్తం చేసిన ఆయన.. తన జీవితకాలంలో మూడోవంతు సమయం జైలులోనే గడిపినా.. కటకటాల వెనక దుర్భర నరకం అనుభవించినా.. మహాత్ముడి బాటలో అహింసనూ, అసమాన క్షమాగుణాన్నీ ప్రదర్శించి.. దక్షిణాఫ్రికా గడ్డపైన జాతి దురహంకారంపై అలుపెరుగని పోరాటం సాగించి.. దిగ్విజయుడై.. చివరికి దేశాధ్యక్షుడై ప్రపంచవ్యాప్తంగా సరికొత్త ప్రజాస్వామ్య స్ఫూర్తిని రగిల్చారు. యావత్ ప్రపంచం నీరాజనాలు అందుకోవటమే కాదు, ఈ ప్రపంచానికి సరికొత్త పాఠాలు కూడా నేర్పారు.**



**17వ** శతాబ్దంలో డచ్ ఈస్టిండియా కంపెనీ, ఆంగ్లేయులు.. దక్షిణాఫ్రికాను ఆక్రమించి, స్థానిక జాతులను అణచివేశారు. ఎన్నో యుద్ధాల అనంతరం 1910 మే 31న 'యూనియన్ ఆఫ్ సౌతాఫ్రికా' ఆవిర్భవించింది. అందులో నల్లజాతి వారికి మాత్రం ఓటు హక్కు లేదు. దీంతో కొన్నేళ్ల తర్వాత నల్లవారి హక్కుల కోసం పోరాడేందుకు 'ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ)' ఏర్పడింది. ప్రభుత్వ ఆలోచనల్లో మార్పయితే రాలేదు, పైగా ఉద్యోగాల్లో రిజర్వేషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చి, నైపుణ్య ఉద్యోగాలకు నల్లవారిని అనర్హులుగా దూరం పెట్టింది. కొన్ని పట్టణాల్లో నల్లవారు అడుగుపెట్టకూడదని శాసించింది. దక్షిణాఫ్రికాలో తెల్లపాలకుల దమన పాలన ఇలా సాగుతుండగా..

## చరిత్ర మొదలైంది

క్యును అనే గ్రామంలో 1918 జూలై 18న మండేలా జన్మించాడు. ఆయన తండ్రి ఓ చిన్న తెగకు నాయకుడు. మండేలాకు పదేళ్ల వయసు వచ్చేసరికి తండ్రి చనిపోయాడు. సమీప బంధువుల ఇంట్లో పెరుగుతూ.. తెల్లవారు తమ దేశానికి రాకముందు అనుభవించిన స్వేచ్ఛా జీవితాన్ని గురించి రాత్రివేళల్లో పెద్దలు చెప్పే కథలు మండేలా మదిలో ఆలోచనలు రేకెత్తించాయి. నల్లజాతి వీరుల పోరాట గాథలు వింటున్నప్పుడే తమ ప్రజల మేలు కోసం ఏదైనా చేయాలన్న ఆలోచన మండేలా మదిలో మొగ్గ తొడిగింది.

డిగ్రీ పూర్తిచేసే నాటికి వాల్టర్ సిస్లూతో మండేలాకు పరిచయం ఏర్పడింది. ఆయన సిస్లూ ఇంట్లోనే ఉండేవారు. నర్స్‌గా పనిచేస్తున్న ఎవ్లిన్ మేస్‌ని మండేలాకు.. సిస్లూ పరిచయం చేశారు. ఇద్దరూ 1944లో పెళ్లి చేసుకున్నారు. ఎవ్లిన్ కుటుంబ భారాన్ని తీసుకోవడంతో మండేలాకు విట్స్ వర్సిటీలో న్యాయవిద్య చదివే అవకాశం దక్కింది. సిస్లూ సాంగత్యంతో మండేలా ఏఎన్‌సీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం మొదలైంది. 1948 నాటికి ఏఎన్‌సీ యూత్‌లీగ్‌లో ప్రముఖ నేతగా ఎదిగారు. సరిగ్గా.. అదే ఏడాది.. నల్లవారిని మరింత అణచివేసి, జాతి వివక్షను క్రూరంగా అమలు చేస్తామన్న వాగ్దానంతో 'నేషనల్ పార్టీ' అధికారంలోకి వచ్చింది. 'విభజించు.. పాలించు' సూత్రంతో అన్ని రకాల అకృత్యాలకూ పాల్పడింది. ఆ సమయంలోనే మహాత్మాగాంధీ స్ఫూర్తితో

ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేయాలని మండేలా వాదించారు. ఏఎన్‌సీ సమ్మె పిలుపునకు మంచి స్పందన రావడంతో మండేలా పేరు మార్మోగింది. 1952లో ఏఎన్‌సీ జాతీయ ఉపాధ్యక్షుడిగా మండేలా ఎన్నికయ్యారు. కమ్యూనిజం వ్యాప్తికి తోడ్పడుతున్నారన్న ఆరోపణలపై మండేలా సహా 22 మంది నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. జైలు శిక్ష విధించింది. 1955 జూన్ 26న జోహెన్నెస్‌బర్గ్‌లో జరిగిన మహాసభకు వేలాదిమంది హాజరై.. మండేలా తయారు చేసిన హక్కుల పత్రాన్ని (ద ఫ్రీడం ఛార్టర్) ఆమోదించారు. ఆగ్రహించిన ప్రభుత్వం మండేలాతో పాటు 156 మంది నేతలపై కుట్రకేసు మోపింది.

ఇతర వర్ణాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలతోనూ సాన్నిహిత్యంగా మెలగాలనే మండేలా వాదన 1958లో ఏఎన్‌సీలో చీలికకు దారితీసింది. 'పాన్ ఆఫ్రికన్ కాంగ్రెస్' ఏర్పాటైంది. కొత్త రాజ్యాంగం కోసం ఏఎన్‌సీ సమ్మెను ప్రభుత్వం అణచివేయడంతో ఏఎన్‌సీ, కమ్యూనిస్టు పార్టీలు హింసాయుత పోరాటానికి నిర్ణయించాయి. మండేలా పలు ఆఫ్రికా దేశాల్లో రహస్యంగా పర్యటించి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. స్వదేశానికి తిరిగొచ్చి మారువేషాల్లో తిరుగుతూ ఉద్యమ ప్రచారం చేపట్టారు. పోలీసులకు పట్టుబడటంతో కోర్టు ఐదేళ్ల జైలుశిక్ష వేసింది. మరుసటి ఏడాది కొత్త అభియోగాలు మోపారు. మండేలా తదితరులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఆ తర్వాత మండేలా దాదాపు 27 ఏళ్లపాటు రాబెన్ ఐలాండ్ జైలులో కటిక నేలపై, అరకొర ఆహారంతో దుర్భర జీవితాన్ని గడిపారు.

మండేలా తన ఆత్మకథ 'లాంగ్ వాక్ టు ఫ్రీడమ్'లో జైలు నుంచి విడుదలైన క్షణాల గురించి ప్రస్తావిస్తూ.. 'ఆ గేటు నుంచి బయటకు వస్తున్నప్పుడు.. 71 ఏళ్ల వయసులో కూడా.. నాకు కొత్త జీవితం ప్రారంభిస్తున్నట్టుగా అనిపించింది" అని వ్యాఖ్యానించారు.

### సాధించిన మండేలా..

1976 నాటికి దేశంలో పరిస్థితులు వేగంగా మారాయి. దేశంలో ఆందోళనలకు తోడు, అంతర్జాతీయంగా ఒత్తిడులు పెరిగాయి. దేశాన్ని వీడితే.. జైలు నుంచి వదిలిపెడతామని ప్రభుత్వం మండేలాకు రాయబారం పంపింది. అందుకాయన ససేమిరా అన్నారు. మండేలా అలుపెరుగని దీక్ష ప్రపంచ దేశాల మన్ననలు అందుకుంది. చివరికి ప్రభుత్వం.. జాతి వివక్షను రద్దు చేసి కొత్త రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయడం తప్పదని గుర్తించింది. ఎట్టకేలకు 1990లో ఎఫ్.డబ్ల్యు డీక్లార్క్ మండేలాను విడుదల చేశారు. దశాబ్దాలపాటు దక్షిణాఫ్రికాను బహిష్కరించిన దేశాలు మళ్లీ చేరువయ్యాయి. విడుదల విషయంలోనూ మండేలా తెల్లవారిపై ఎలాంటి విద్వేష ప్రకటనలూ చేయలేదు. అత్యంత సంయమనం ప్రదర్శించి క్షమాగుణానికి మారుపేరుగా మన్ననలందుకున్నారు. అన్ని జాతుల వారికి సమాన హక్కులు ఉండే ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం తక్షణ కర్తవ్యంగా భావించారు. కొన్ని అవాంతరాలు ఏర్పడినా మండేలా కృషితో ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. దక్షిణాఫ్రికా చరిత్రలో తొలిసారిగా అన్ని జాతుల వారూ ప్రజాస్వామ్య ఎన్నికల్లో ఓటేశారు. కొత్త దక్షిణాఫ్రికాకు మండేలా ప్రథమ అధ్యక్షుడయ్యారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోనని ముందే ప్రకటించారు. అధ్యక్షుడయ్యాక అతిపెద్ద సమస్య పేదలకు గృహాలు కల్పించడం, మురికివాడలు. తన సహచరుడు థాబో ఎంబెకీకి ఆ బాధ్యతలు అప్పజెప్పారు. తదనంతరం మండేలా దక్షిణాఫ్రికాకు సరికొత్త అంతర్జాతీయ ప్రతిష్ఠను నిర్మించారు. ■

## అన్ని సరిహద్దుల్నీ అధిగమించిన మండేలా

**- జేపీ నివాళి**

"నెల్సన్ మండేలా ఒక నైతిక శిఖరం, ఆరాధ్య నాయకుడు. నిజమైన నాయకత్వం అన్ని సరిహద్దుల్నీ అధిగమిస్తుంది కాబట్టి మహాత్మా గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్‌లాగా మండేలా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉంటారు" అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.

మండేలాకు ఈర్ష్యాద్వేషాలు మచ్చుకైనా లేవని, ప్రేమ, గౌరవం, ఆత్మస్థైర్యంతో అన్నిటినీ జయించగలమని, చరిత్రను నిర్మించగలమని మండేలా నిరూపించారని జేపీ అన్నారు. దశాబ్దాల తరబడి మానవాళి అంతరాత్మగా మండేలా నిలిచారని, మానవజాతిలోని అత్యుత్తమత్వానికి ఆయన సంకేతమని అన్నారు. అనుక్షణం సంపూర్ణంగా జీవించే చైతన్యం మండేలాలో తొణికిసలాడుతుండేదని, ఆయనో మహోన్నత జీవితమని జేపీ నివాళులర్పించారు.

# ఒక యుగం కన్నుమూత

- జాతి వివక్షపై ఎత్తిన పిడికిలి నెల్సన్ మండేలా అస్తమయం
- చిన్నబోయిన దక్షిణాఫ్రికా
- ప్రపంచ దేశాల సంతాపం

పశ్చిమ దేశాల పీడనలో నిరాశా నిస్పృహల చీకట్లు అలముకున్న ఆఫ్రికా ఖండ ప్రజల్లో ఆశల వెలుగు నింపిన నల్ల సూరీడు అస్తమించాడు. గాంధేయ మార్గంలో అవిశ్రాంతంగా పోరాడి దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష ప్రభుత్వానికి చరమగీతం పాడిన యోధుడు శాశ్వతంగా విశ్రమించాడు. అర్ధ శతాబ్దం పాటు కోట్ల మంది పోరాటాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా కన్ను మూశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో ఉన్న 95 ఏళ్ల మండేలా జొహన్నెస్‌బర్గ్ శివారులోని తన నివాసంలోనే కుటుంబ సభ్యుల సమక్షంలో తుదిశ్వాస విడిచారు. సెప్టెంబరు నుంచి ఆయన ఇంట్లోనే వైద్య చికిత్స పొందుతున్నారు. అంతకు ముందే మూడు నెలల పాటు ప్రిటోరియా ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధికి చికిత్స పొందారు. రెండేళ్లుగా ఆయన తరచూ జబ్బున పడుతున్నారు. దక్షిణాఫ్రికా దేశాధ్యక్షుడు జాకబ్ జుమా టీవీలో జాతినుద్దేశించి మాట్లాడుతూ, "మన ప్రియతమ నేత, ప్రజాస్వామ్య దక్షిణాఫ్రికా వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్సన్ రోలిహ్లాలా మండేలా ఇకలేరు" అని ప్రకటించారు. "మన దేశం గొప్ప తనయుణ్ణి కోల్పోయింది. ప్రజలు తండ్రిని కోల్పోయారు" అని వ్యాఖ్యానించారు.

## మండేలా మాటలు...

మహాత్మాగాంధీ తనకు ఆదర్శమని పలు సందర్భాల్లో చెప్పిన మండేలా, తన పోరాటంలో గాంధీ మార్గాన్నే అనుసరించారు. జాతి వివక్షకు వ్యతిరేకంగా మొక్కవోని దీక్షతో పోరాటం సాగించారు. ఆఫ్రికా ప్రజల పోరాటానికి తన జీవితాన్నే అంకితం చేశారు. రంగు, మతం, నేపథ్యాల కారణంగా మనుషులెవరూ ద్వేషిస్తూ పుట్టరని, వారు ద్వేషించడాన్ని నేర్చుకుంటారని, ద్వేషించడం నేర్చుకోగలిగిన మనుషులకు ప్రేమించడమూ నేర్పవచ్చని విశ్వసించారు.

**"భారతదేశం గాంధీ పుట్టిన దేశం. దక్షిణాఫ్రికా ఆయనను దత్తత తీసుకున్న దేశం. ఆయన భారత్, దక్షిణాఫ్రికా రెండు దేశాల పౌరుడు. ఆయన మేధో, నైతిక సంపత్తికి రెండు దేశాలూ తోడ్పడ్డాయి. ఈ రెండు వలస దేశాల్లోనూ విముక్తి ఉద్యమాలకు ఆయన రూపమిచ్చారు."** *-(2000 జనవరి 3న టైమ్ మేగజీన్‌లో రాసిన 'ద సేక్రెడ్ వారియర్' వ్యాసంలో..).*

**"జాతి వివక్షను దాని అన్ని రూపాల్లో చాలా తీవ్రంగా ద్వేషిస్తున్నా. దీనిపై నా తుదికంటా పోరాడుతా."** *-(ఓ సమ్మె కేసుపై 1962లో జరిగిన కోర్టు విచారణలో..).*

**"నా జీవితకాలంలో నన్ను నేను ఆఫ్రికా ప్రజల పోరాటానికి అంకితం చేశాను. తెల్లవారి ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాను. నల్లవారి ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాను. అందరూ శాంతియుతంగా, సమాన అవకాశాలతో కలిసి జీవించే ప్రజాస్వామ్య, స్వేచ్ఛా సమాజం కావాలనేది నా ఆకాంక్ష. ఆ ఆకాంక్ష కోసం నేను జీవించాలనుకుంటున్నా. కానీ.. ఆ ఆకాంక్ష కోసం అవసరమైతే నేను చనిపోవటానికి సిద్ధం."** *-(1964లో ప్రిటోరియా సుప్రీం కోర్టులో ప్రకటన..).*

**"ఒక సోదరుడితో మరో సోదరుడు పోరాడే ఈ యుద్ధంలో పాలుపంచుకునే వారందరికీ నా సందేశమిది : మీ తుపాకులు, మీ కత్తులు, మీ కొడవళ్లు తీసుకెళ్లి సముద్రంలో పారేయండి. మృత్యు కర్మాగారాలను మూసేయండి. ఈ యుద్ధాన్ని ఇక ముగించండి."** *-(1990 ఫిబ్రవరి 25న దర్బన్‌లో ఒక బహిరంగసభలో ప్రసంగం..).*

**ఏ ఒక్కరూ మరొక వ్యక్తిని అతడి శరీర రంగు, అతడి నేపథ్యం, అతడి మతం కారణంగా ద్వేషిస్తూ పుట్టరు. మనుషులు ద్వేషించడం నేర్చుకుంటారు. వారు ద్వేషించటం నేర్చుకోగలిగినపుడు.. వారికి ప్రేమించటం కూడా నేర్పించవచ్చు. ఎందుకంటే ద్వేషం కన్నా ప్రేమ అనేది మానవ హృదయానికి మరింత సహజంగా వస్తుంది."**

**"ధైర్యం అంటే భయం లేకపోవటం కాదని.. భయాన్ని అధిగమించటమని నేను తెలుసుకున్నా. ధైర్యవంతులంటే భయం లేని వారు కాదు.. భయాన్ని జయించినవారు."** *-(లాంగ్ వాక్ టు ఫ్రీడమ్, 1995..)* ■

# రోగాల పుట్టగా మారిన పురపాలక సంఘాలు
# శుద్ధి చేసిన మంచినీరు, మెరుగైన పారిశుద్ధ్యం కోసం నిలదీయండి



- తాగునీటి కాలుష్యం, పారిశుద్ధ్య లోపంతో వచ్చే జబ్బులలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది.
- శిశు మరణాలలో 14 శాతం విరేచనాలే కారణం.
- జ్వరాలు, వాంతులు, జాండీస్, తదితర నీటి ఆధారిత జబ్బులు అందరినీ పీడిస్తున్నాయి.
- మొత్తం జబ్బులలో 60 శాతానికి మున్సిపల్ పాలనే కారణం అయింది.

## తాగునీటి పరీక్షలు నిర్వహించండి

## శుద్ధిచేసిన మంచినీటి కోసం ఉద్యమించండి

### మెరుగైన పారిశుద్ధ్యం కోసం పోరాడండి - మున్సిపల్ రోగాలను అరికట్టండి

### లోక్‌సత్తా పార్టీ డిమాండ్స్

1. మంచినీళ్లు, పారిశుద్ధ్యం, రోడ్లు తదితర సమస్యలపై ఎక్కడికక్కడే పరిష్కారం కోసం వార్డు స్థాయిలో చట్టబద్ధ ప్రజాకమిటీలు వెయ్యాలి.
2. వార్డు కమిటీలకు నేరుగా తలసరి 1500 రూపాయలు వార్షిక గ్రాంటు ఇవ్వాలి.
3. పబ్లిక్ హెల్త్ శాఖ నియమాలకు అనుగుణంగా శుద్ధిచేసిన మంచినీరు, మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలి.
4. పారిశుద్ధ్యం తదితర ప్రయివేటు కాంట్రాక్టులలో ప్రజా ఆడిట్ ద్వారా జవాబుదారీతనం తేవాలి.
5. మంచినీరు, పారిశుద్ధ్య లోపం వల్ల కలిగే జబ్బులకు, మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

### శుద్ధి చేసిన మంచినీరు కోసం కార్యాచరణ

- శుద్ధిచేసిన మంచినీరు అందించడంలో మున్సిపాలిటీ నియమనిబంధనలు – ఉల్లంఘనలపై రౌండ్‌టేబుల్, కాలనీ, రేట్ పేయర్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్లు ఇతర ప్రజాసంఘాలతో నిర్వహించాలి.
- డిసెంబరు నాల్గవ వారంలో అన్ని వార్డులలో ప్రజల భాగస్వామ్యంతో "తాగునీటి పరీక్షలు" నిర్వహించాలి.
- కలుషితమైన ట్యాప్‌లు, బోర్లకు "తాగునీరు కాదు" అని బోర్డులు పెట్టాలి.
- జనవరి మొదటి వారంలో ప్రభుత్వ–ప్రయివేటు ఆసుపత్రులలో పేషెంట్లపై సర్వే – నీటి ఆధారిత జబ్బులపై గణాంకాల వెల్లడి.
- జనవరి 16 నుండి – నిర్దిష్ట డిమాండ్లతో సంతకాల సేకరణ – మెమోరాండం.
- జనవరి 30 – గాంధీ వర్ధంతి, సామూహిక ప్రజా సత్యాగ్రహం.

# మున్సిపాలిటీల తప్పుడు రిపోర్టుల గుట్టురట్టు చెయ్యండి

## ప్రభుత్వ ఉత్తర్వుల అమలుకోసం ఉద్యమించండి

మున్సిపాలిటీలలో ఎన్నికలు లేవు. ప్రజాప్రతినిధులు లేరు. పౌరుల గోడు పట్టించుకునే నాధుడు లేడు. ఆలనాపాలనా లేకపోతే ప్రజలకు అన్నీ సమస్యలే.. ప్రజలు స్పందించాలి. పౌర సమాజ సంస్థలు స్పందించాలి. రోగాల పుట్టగా మారిన పురపాలక సంఘాలలో కనీస పౌరసేవలను సాధించుకోవాలి.

2013 జూలై నెలలో పబ్లిక్ హెల్త్ మరియు పురపాలక ఇంజనీరింగు శాఖ మంచినీటి ప్రమాణాలను పాటించాలని, పారిశుధ్య సేవలు మెరుగుపర్చాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఐదు నెలలు గడిచిపోయాయి. పరిస్థితులు మెరుగుపడలేదు కాని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అన్నీ సజావుగా సాగిపోతున్నాయన్న అబద్ధపు రిపోర్టులు కనిపిస్తున్నాయి.

నీళ్ల ట్యాంకులు శుభ్రం చెయ్యాలి. తిరిగి ఏ తేదీన శుభ్రపరిచేది అక్కడ ప్రదర్శించాలి. క్లోరిన్ కలపాలి. అది తగిన మోతాదులో వున్నదీ లేనిదీ పరీక్షించాలి. లేనిచోట బాక్టీరియా పరీక్ష చెయ్యాలి. డ్రైయినేజీలలో పూడిక తీయ్యాలి. చెత్తాచెదారం తొలగించాలి. దీనిపై రిపోర్టులను ప్రజలు తెలుసుకోవడానికి మున్సిపాలిటీలవారీగా చూసుకునే వీలు కల్పించాలి. PHMED వెబ్‌సైట్‌లో మున్సిపాలిటీల వారీగా మంచినీటి పరీక్షల వివరాలు ఉంటాయి. అత్యధిక మున్సిపాలిటీలలో అన్ని నిబంధనల మేరకు సజావుగానే వున్నాయని కనిపిస్తుంది. కొన్నిచోట్ల ఒకటి రెండు తేదాలు క్లోరిన్ శాతంపై కనిపిస్తాయి. ఇక బాక్టీరియా పరీక్షలు నిర్వహిస్తే ఎక్కడా కలుషిత నీరు లేదని తేల్చారు.

ఈ రిపోర్టులన్నీ నిజమైతే మున్సిపాలిటీలలో నీటి చుట్టూ దాపురించే జబ్బులు రాకూడదు. మున్సిపాలిటీల రిపోర్టులు కూడా దానినే సూచిస్తున్నాయి. మొత్తం 179 మున్సిపాలిటీలలో ఎక్కడా కూడా నీటి సంబంధమైన ఒక్క జబ్బు కూడా నమోదు కాలేదట! ఈ రిపోర్టుల గుట్టురట్టు చెయ్యాలి.

- మంచినీళ్ల పరీక్షలు నిర్వహించండి.
- క్లోరిన్ శాతాన్ని బయట పెట్టండి.
- బాక్టీరియా టెస్టులు నిర్వహించండి.
- నీటి కాలుష్యాన్ని వెలికి తీయ్యండి.
- ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రులను సందర్శించండి.
- నీటి సంబంధిత రోగాల చిట్టా విప్పండి.
- ఒక నెల రోజులలో ఎన్ని జబ్బులు నమోదైంది స్థూలంగా ఒక అంచనాకు రండి.

**మంచినీటి స్థితిని నిగ్గు తేల్చండి**

**పారిశుద్ధ్యం స్థితిని ఎండగట్టండి**

**నీటి సంబంధిత జబ్బులు లేవన్న బుకాయింపుల బండారాన్ని బయట పెట్టండి** ■



# GOVERNMENT OF ANDHRA PRADESH
# PUBLIC HEALTH & MUNICIPAL ENGINEERING DEPARTMENT

**Circular Lr. No. : 21305/T2/Gastro/2013** **Dated : 11-07-2013**

To
**The Municipal Commissioner,**
Municipality/
Municipal Corportaion,

*Sir,*

**Sub:-** **Maintenance of water supply schemes in various Municipalities- Preventive measures, collection and analysis of water samples, remedial measures to be taken to avert water borne diseases etc., Certain instructions - Regarding.**

**Ref :-** **This Office Circular Letter No. 21305/T2/Gastro/2012, Dt. 21-05-2013**

*****

As a measure to premonsoon/cyclone preparedness,I emphasize to takeup certain measures to avert water borne diseases a part from instructions being issued from time to time to ensure supply of safe drinking water to public. These measures are classsified into three stages viz., Preventive, Monitoring and Remidial which are as follows :

**I) Preventive Measures to be taken up**

- Driniking water storage tanks must be ensured free from contamination.
- All the open drains/storm water drains shall be cleared of silt.
  - (i) For quick disposal of sullage/rain water, clearing of storm water drains should be taken up immediately with a suitable action plan to clear off the silt before onset of monsoon.
  - (ii) The silt removed from the drains shall be taken away immediately after becoming dry avoiding the access again into the drain unlike the earlier practice.
- Garbage and debris shall be lifted daily by making necessary arrangements.
- Ensure joints of drinking water pipe lines do not come in drains/Nalas if necessary by religning of pipe lines providing suitable casing for water supply pipes to avoid contamination.
- Sufficient contact time with more permitted dosages of chlorine should be maintained in pumping mains and ELSRs to ensure action on the organic matter to eliminate its presence in the treated water. Display boards indicating dates of cleaning of ELSRs and sumps shall be erected.
- All the distribution lines should be scoured regularly.
- Ensure no pit taps in the town to safeguard against entry of polluted water in to distribution system.
- Leaks in the distribution systems shall be attended on top priority.
- Sleeves shall be provided on the pipe lines crossing drains to avoid direct contact of drain water with water pipe lines.
- No used / waste water is to be allowed to accumulate around the drinking water sources. Soak pits / leading drains shall be constructed for all bore wells and public taps if they are not constructed.
- Platforms for all bore wells and public taps shall be constructed.
- Campaigning shall be done through media/announcements and mike/pamphlets for not to throw the waste materials in the drains / culverts.
- Special attention and care is to be given to the vulnerable places / localities where there is possibility of pollution based on the previous records.

**II Monitoring of Water Quality :**

- CRITICAL & PROBLEMATIC AREAS

(i) A Task Team ofr officers consisting of the Engineers from Public Health Engg. Department, Municipal Officers looking after sanitation and water supply and other Public Health officers to be constituted. Team shall identify the critical and problematic areas in the town and shall furnish inspection report every day and the Municipal Commissioner shall indicate the follow up action taken.

(ii) Invariably they should check residual Chlorine in those problematic areas on daily basis.

They should conduct $H_2S$ strip test / bacteriological examination in these areas frequently and should be documented.

- One sample shall invariably be collected at source after post chlorination at Treatment plant / infiltration gallery/ bore well.
- Samples at the rate 1% of HSCs and 2% of PSPs to be collected in a cycle and analysed for residual chlorine. The total No. of samples collected for each Municipality is fixed at the rate of one sample for every 5,000 population per day.
- The residual chlorine found should not be less than 0.2 P.P.M. If the same is less than 0.2 P.P.M., reason for less chlorine content shall be immediately identified, examined and corrective measures shall be taken immediately.
- After rectifying the cause of depletion in the residual chlorine, the water samples need to be collected again and analyzed for residual chlorine and bacteriological analysis by the nearest Indian Preventive Medicine Laboratory duly conducting $H_2S$ strip test to confirm wheather it is wholesome or unwholesome. Accordingly corrective measures for rectification of water supply distribution need to be repeated for ascertaining the wholesomeness/ poratability of water.
- For the convenience of Public, Municipalities / Municipal Corporations shall update the information in the website http://uwsis/cgg.gov.in on daily basis regularly without fail.

**III Remedial Measures :**

- Whenever pollution is detected the public in the area shall be advised to use chlorine tablets to maintain residual chlorine in the drinking water stored. Also Public shall be advised to boil water before consumption.
- Whenever the pollution is noticed, that area should be isolated duly disconnecting the water supply through distribution network. Tanker water supply should be resorted until the source of pollution is arrested and water supply is restored.
- Any case of disruption of water supply should be immediately brought to the notice of the Regional officers as well as this office by the Municipal Commissioners / Municipal Engineers.
- Required water tankers mounted on lorries need to be deployed to ensure that safe drinking water is transported and made available in the localities which are affected with water borne diseases.
- The water tankers should be leak proof and well painted and disinfected regularly cleaned to avoid any possibilityof wastage of water during transportation and also to avoid any sort of possible contamination.
- Wherever Urban Health Centers are there, sufficient stock of medicines must be kept ready to deal with water borne diseases like gastroenteritis, etc.
- Adequate stocks of larvicides must be kept for taking up antilarvel operations after the cyclone in water stagnated areas.
- Diesel Engines must be hired and kept at all such places to bail out water as quickly as possible to avoid the submergence of residential localities.

The above instructions shall be scrupulously followed.

Yours faithfully

**Sd/-**

for **ENGINEER-IN-CHIEF (PH)**

♦♦♦

# మద్యంపై సమరశంఖం పూరించండి

## బాధిత కుటుంబాలకు "భరోసా" ఇవ్వండి




- రాష్ట్రంలో మద్యం కోరల్లో 70 లక్షల కుటుంబాలు
- మంచంలో మద్యం బానిసలు-వీధినపడ్డ పిల్లలు
- మద్యం మరణాలు - చిన్న వయస్సులో వితంతువులు
- చెదిరిన కుటుంబాలు
- యాక్సిడెంట్ మరణాల విషాదాలు

## ప్రభుత్వ విధానాల పాపం - పేదల పాలిట శాపం

### బెల్టు షాపుల్ని నిషేధించాలి – కఠిన మద్యనియంత్రణ అమలు చెయ్యాలి

### మద్యం బాధిత కుటుంబాలకు భరోసా పథకాన్ని తక్షణం ప్రకటించాలి

### లోక్‌సత్తా పార్టీ డిమాండ్స్

1. తక్షణమే అన్ని బెల్టుషాపుల్ని తొలగించాలి. మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలి.
2. మద్యం బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించే ప్రత్యేక సంక్షేమ పథకాన్ని ప్రకటించాలి (బాధితులకు వైద్య సహాయం - పిల్లల చదువుకు స్కాలర్‌షిప్పులు - వితంతువులకు ప్రత్యేక పెన్షన్ తదితర అంశాలతో)
3. ప్రతి నియోజకవర్గంలో ఒక డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు లేదా ప్రయివేటు చికిత్సకు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరించే ఏర్పాటు.
4. బెల్టుషాపులు తొలగించిన పంచాయితీలకు ప్రత్యేక గ్రాంట్ల ప్రకటన – సర్పంచులకు, సభ్యులకు గౌరవ పురస్కారాలు.

### మద్యంపై ప్రజా ఉద్యమ కార్యాచరణ

**డిసెంబరు 20 :** ఉద్యమ కరపత్రాలు – పోస్టర్ల విడుదల. పబ్లిక్ ఎంక్వయిరీ ద్వారా గ్రామాలవారీగా, మున్సిపల్ వార్డుల వారీగా బాధిత కుటుంబాల గుర్తింపు – వారి కష్టనష్టాల వివరాల సేకరణ.

***డిసెంబరు 30 :*** స్థానికంగా అందుబాటులో వున్న డీ-ఎడిక్షన్ సెంటర్లకు సందర్శన.

***జనవరి 10-12 :*** నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వంపై ప్రజాభియోగపత్రాల ప్రకటన.

మద్యం బాధిత కుటుంబాల కష్టానష్టాల వివరాలతో ప్రభుత్వంపై నేరారోపణలు.

***జనవరి 16-25 :*** అన్ని నియోజకవర్గాలలో బాధిత కుటుంబాలకు భరోసా యాత్ర.

రాష్ట్ర స్థాయిలో జేపీ "బాధిత కుటుంబాలకు భరోసా యాత్ర".

***జనవరి 30 :*** గాంధీ వర్ధంతి, సామూహిక ప్రజా సత్యాగ్రహం

# రాష్ట్ర బడ్జెట్‌లో మద్యం ఆదాయం

రాష్ట్ర బడ్జెట్‌కు మద్యం ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ప్రస్తుతం వ్యాట్ రాబడి గత ఏడాది కంటే 26 శాతం మేర పెరగగా దీనిలో సింహ భాగం మద్యం నుంచే లభించింది. మద్యంపై పన్ను రేట్ల విధానాన్ని మార్చివేసి గరిష్టంగా 190 శాతం మేర వ్యాట్‌ను విధిస్తుండటం వల్లనే ఇంతటి రాబడి సాధ్యమవుతోంది. మరోవైపు రాష్ట్ర బ్రేవరేజస్ కార్పొరేషన్ మద్యంపై వసూలు చేస్తూ వచ్చిన లాభాన్ని ఇప్పుడు ఇలా పన్ను ద్వారా ఆర్జిస్తూ కేంద్రానికి కట్టాల్సిన ఆదాయపు పన్నులో ఆదా చేయటానికి రాష్ట్ర సర్కారుకు అస్కారం ఏర్పడింది. కొత్త బడ్జెట్‌లో వ్యాట్ రాబడి లక్ష్యం రూ. 65 వేల కోట్లపైనే ఉండబోతున్నట్టు సమాచారం.




రాష్ట్ర ప్రస్తుత బడ్జెట్‌లో వ్యాట్ రాబడి లక్ష్యం రూ. 52,500 కోట్లు. గత ఏడాదితో పోలిస్తే వ్యాట్ వసూళ్లలో 26 శాతం మేర వృద్ధి కనిపిస్తోంది. విశేషమేటంటే ఈ వసూళ్లలో మద్యాన్ని మినహాయించి చూస్తే మిగతావాటిపై వృద్ధి రేటు కేవలం 11 శాతం మేర మాత్రమే ఉంది. పెట్రోల్, డీజిల్‌తో సహా నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరుగుతున్నప్పటికీ వాటి వ్యాట్‌లో వృద్ధి తక్కువగా ఉండటానికి కారణం.. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో చెప్పుకోతగ్గ ప్రగతంటూ లేకపోవటమేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇటువంటి ప్రగతి లేనందున సరుకుల రవాణా తగ్గి డీజిల్ అమ్మకాలపై కూడా ప్రభావం పడిందని అంటున్నారు. దీంతో ఇప్పుడు మద్యంపై వ్యాట్ రాబడే బడ్జెట్‌కు ప్రధాన ఆదాయ వనరుగా మారినట్లయ్యింది. కేవలం మద్యంపై వ్యాట్ రాబడినే తీసుకొంటే 25 శాతం మేర పెరుగుదల కనిపిస్తోంది.

**ఆదాయపు పన్ను ఆదా కోసం పన్ను విపరీతంగా పెంపు**

ప్రభుత్వం గత ఏడాది అనుసరించిన కొత్త విధానమే ఇంతటి పెరుగుదలకు దారితీసింది. ఇంతకుముందు రాష్ట్ర బ్రేవరేజస్ కార్పొరేషన్ మద్యం సీసాలపై లాభాలను ఆర్జిస్తూ ఉండేది. అయితే ఇటువంటి లాభాలపై ఆదాయపు పన్నును కట్టాలంటూ ఆదాయపు పన్ను శాఖ నోటీసులను పంపిస్తుండటంతో ప్రభుత్వం గత ఏడాది ఒక కొత్త ఎత్తు వేసింది. సీసాలపై బ్రేవరేజస్ కార్పొరేషన్ ఆర్జించే లాభాల స్థానే మద్యంపై పన్ను రేట్లను బాగా పెంచింది. అంతవరకు ఈ పన్ను రేటు 70 శాతం మేర మాత్రమే ఉంటూ రాగా దీన్ని మద్యం రకాలను బట్టి 70 నుంచి 190 శాతం వరకు నిర్దేశించింది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 12,500 కోట్లను మద్యంపై వ్యాట్ ద్వారానే సర్కారు రాబట్టదలచింది. ప్రభుత్వం తలపోసిన దానికంటే మద్యంపై వ్యాట్ రాబడి విపరీతంగా పెరిగి బడ్జెట్‌కు ప్రదాన ఆదాయ వనరుగా మారటానికి దారితీసింది. ఇంతకు ముందటి లాభాల కంటే ఈ పన్ను పెంపు ద్వారా వచ్చిపడుతున్న ఆదాయమే ఎక్కువగా ఉంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయపన్ను బెడద తప్పి ఆమేరకు కూడా ప్రయోజనం కలిగింది. ప్రస్తుత వృద్ధి రేటును బట్టి రానున్న 2014-15 బడ్జెట్‌లో వ్యాట్ రాబడి లక్ష్యాన్ని రూ. 65 వేల కోట్లకు పైగానే నిర్ణయించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

**ఎక్సైజ్‌ను కూడా కలిపితే రాబడి రూ. 20వేల కోట్లపైనే**

ఎక్సైజ్ శాఖ మద్యంపై రాబడుతున్న రాబడిని కూడా లెక్కలోకి తీసుకొంటే ఈ ఏడాది బడ్జెట్‌కు మద్యంపై వచ్చేది రూ. 20 వేల కోట్లపైనే ఉంటుంది. షాపుల లైసెన్సు ఫీజులు తదితరాల ద్వారా ఎక్సైజ్ శాఖ ఈ ఏడాది రూ. 7,500 కోట్లను సంపాదించాల్సి ఉండగా ఆగస్టు నాటికే అందులో 30 శాతం మేర సమకూరింది. ■

# ఉపాధి కోసం యువభేరి




- దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తున్నది.
- 15-29 సం॥ల యువతలో 13.3 శాతం నిరుద్యోగం.
- డిగ్రీ ఆ పై చదువు గలవారిలో 36.6 శాతం నిరుద్యోగం.
- 2012లో ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం, నిరుద్యోగం వల్ల 1308 మంది ఆత్మహత్యలు.
- 2012లో ఆత్మహత్యలలో ఆంధ్రప్రదేశ్ 14,238 మందితో అగ్రస్థానంలో ఉంది.
- అందులో 30-44 సం॥ల మధ్య వయస్సువారు 5,094

## వాగ్దానాలతో దగా చేసే రాజకీయం పోవాలి

### రాజీవ్ యువకిరణాల గుట్టు విప్పండి - ఉపాధి కోసం గట్టిపోరు తలపెట్టండి

### యువత మేలుకో - దేశాన్ని ఏలుకో

### లోక్‌సత్తా పార్టీ డిమాండ్స్

1. యువతకు భరోసా ఇవ్వండి-ఆత్మహత్యలను నిరోధించండి.
2. ఆర్థిక సామాజిక అవసరాలను తక్షణం మదింపు చేసి నిరుద్యోగుల చదువుకు తగ్గ నైపుణ్యాలనిచ్చి ఉపాధి కల్పించాలి.
3. శిక్షణ కాలంలో యువతకు ఉపకార వేతనం.
4. వస్త్రోత్పత్తి రంగాన్ని విస్తృతపర్చాలి, గ్రామీణ వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి.
5. చిన్న పట్టణాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.
6. ఏటా 10 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రణాళిక ప్రకటించాలి.
7. పాఠశాల విద్య ప్రాథమిక ఆరోగ్యం, వ్యవసాయం, పేదరిక నిర్మూలన రంగాలలో వివిధ సేవలు అందించే విధంగా యువతకు తర్ఫీదు. వివిధ పథకాల అమలులో తాత్కాలిక ఉపాధి, ఉపకార వేతనం అందించాలి.

### ఉపాధి ఉద్యమ కార్యాచరణ

- **డిసెంబరు చివరి వారంలో -** నిరుద్యోగంపై యూత్ రౌండ్‌టేబుల్.
- **జనవరి 1 నుండి-**రాజీవ్ యువకిరణాల లబ్ధిదారులపై పట్టణాలలో నిజనిర్ధారణ సర్వేలు నిర్వహించాలి.
- **జనవరి 12 -** యువజన దినోత్సవం యువభేరి ఉపాధి సాధన దినంగా పాటించాలి.
- **జనవరి 16 నుండి -** నిరుద్యోగులు, యువకిరణాల దరఖాస్తుదారులు, దగాపడినవారు, యువజన సంఘాలతో రౌండ్‌టేబుల్స్ డిమాండ్ల పత్రం ప్రకటన.
- **జనవరి 20 నుండి -** నిరసన ప్రదర్శనలు.
- **జనవరి 30 -** గాంధీ వర్ధంతి, సామూహిక ప్రజా సత్యాగ్రహం.

# ప్రసరించని యువ కిరణాలు

## బోగస్ శిక్షణ - దగా ప్లేస్‌మెంట్లు

**15** లక్షలమందికి ఉద్యోగాలు కల్పిస్తామని బీరాలు పలికిన రాష్ట్ర ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టింది. శిక్షణా సంస్థలు ఈ సొమ్మును కాజేశాయి. నమోదు చేసుకున్న పేర్లకీ శిక్షణ పొందిన వారి సంఖ్యకీ పొంతన లేదు. 5000 రూపాయల నుండి 9 వేల రూపాయల మేరకు ఒక్కొక్కరి మీద ఖర్చు చూపించారు.

ఇక ప్లేస్‌మెంట్లు సంగతీ అంతే. జిహెచ్‌యంసి పరిధిలో 5872 మందికి శిక్షణ ఇచ్చామంటున్నారు. కాని ఉపాధి దొరికింది 435 మందికే. అంటే 7 శాతం కూడా ఉపాధి రాలేదు. మొత్తం రాష్ట్రంలో 26 లక్షల మంది నిరుద్యోగులు నమోదు చేసుకుంటే ఇప్పటికీ 4 లక్షల మందికి ప్లేస్‌మెంట్స్ ఇచ్చినట్లు ప్రకటిస్తున్నారు. ఇందులో గతంలో ఉద్యోగాలలో వున్నవారు, తాత్కాలికంగా ఒకనెల, రెండు నెలల ఉద్యోగాలు పొందినవారు. కొన్ని పూర్తిగా బోగస్ సంఖ్యలు కనిపిస్తున్నాయి. 15 లక్షల ఉద్యోగాల గడువు దాదాపు పూర్తి అయింది. యువతకు నిరుద్యోగమే మిగిలింది. ప్రభుత్వం కుచ్చు టోపీ పెట్టింది. ఈ ఉపాధి బండారాన్ని బయటకు లాగండి. నిజమైన ఉపాధి కోసం పోరాడండి.

**రాజీవ్ కిరణాలు - అభ్యర్థుల చదువు వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | నిరక్షరాస్యులు | 1,26,677 |
| 2. | 10వతరగతిలోపు | 3,38,766 |
| 3. | 10వ తరగతి పాస్ | 8,13,232 |
| 4. | ఐ.టి.ఐ. | 1,11,477 |
| 5. | పాలిటెక్నిక్ | 43,470 |
| 6. | ఇంటర్ ఫెయిల్ | 61,425 |
| 7. | ఇంటర్ పాస్ | 5,02,344 |
| 8. | డిగ్రీ ఫెయిల్ | 50,879 |
| 9. | డిగ్రీ పాస్ | 3,18,024 |
| 10. | బీ.ఎడ్ | 24,497 |
| 11. | బి.టెక్ ఫెయిల్ | 2,668 |
| 12. | బి.టెక్ పాస్ | 97,198 |
| 13. | పోస్ట్ గ్రాడ్యుయేట్ | 1,19,267 |
| 14. | బి.ఫార్మసీ | 4,704 |

## యువతకు టోపీ ప్రజాధనం లూటీ

**రాజీవ్ యువకిరణాలు**
**జిల్లాలవారీగా నిరుద్యోగుల దరఖాస్తులు**

| నెం. | జిల్లా పేరు | దరఖాస్తుల సంఖ్య |
|---|---|---|
| 1. | శ్రీకాకుళం | 99027 |
| 2. | విజయనగరం | 143284 |
| 3. | విశాఖపట్నం | 148113 |
| 4. | తూర్పు గోదావరి | 136067 |
| 5. | పశ్చిమ గోదావరి | 148947 |
| 6. | కృష్ణా | 138006 |
| 7. | గుంటూరు | 93688 |
| 8. | ప్రకాశం | 78116 |
| 9. | నెల్లూరు | 118762 |
| 10. | చిత్తూరు | 85233 |
| 11. | కడప | 90056 |
| 12. | అనంతపురం | 105850 |
| 13. | కర్నూలు | 95953 |
| 14. | మహబూబ్‌నగర్ | 110596 |
| 15. | రంగారెడ్డి | 107184 |
| 16. | హైదరాబాద్ | 67738 |
| 17. | మెదక్ | 102652 |
| 18. | నిజామాబాద్ | 91998 |
| 19. | ఆదిలాబాద్ | 83892 |
| 20. | కరీంనగర్ | 143277 |
| 21. | వరంగల్ | 140410 |
| 22. | ఖమ్మం | 109823 |
| 23. | నల్గొండ | 135047 |
| 24. | జిహెచ్‌యంసి | 40930 |
| | మొత్తం | *2614649* |

# ఆమ్ ఆద్మీ విజయం... కొత్త రాజకీయానికి గొప్ప మలుపు: జేపీ

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీదే అసలైన విజయమని, పార్టీ సారథి అరవింద్ కేజ్రీవాల్‌ని, కార్యకర్తలను, గెలుపొందిన అభ్యర్థులను లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రత్యేకించి అభినందించారు. ఢిల్లీ ప్రజలకు సెల్యూట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో, హైదరాబాద్‌లో లోక్‌సత్తా పార్టీ కొత్త రాజకీయం దిశగా సాధించిన విజయాలకు మూడు రెట్లు ఎక్కువగా ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో సాధించిందని, ఇది అవినీతి, పాత రాజకీయాలకి చరమఘట్టంగా భావించాలని అన్నారు. ఈవేళ దేశంలో లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ చేస్తున్న రాజకీయమే అసలైనదని, దీనికి కూడా ఓట్లు, సీట్లు వస్తాయని స్పష్టంగా రుజువైందన్నారు. ఈ పరిణామాన్ని సాంప్రదాయ రాజకీయ పార్టీలు ఒక సమస్యగా చూసి ఎలాగైనా కొత్త రాజకీయాన్ని అణగదొక్కుదామనే ధోరణితో కాకుండా మార్పుకు ఒక సంకేతంగా చూడాలని, తమ విధానాలను మార్చుకుని ఓట్ల కొనుగోలు, అవినీతి లేకుండా, ఎదిగే అవకాశాలతో యువతను ఆకట్టుకునే కొత్త రాజకీయం దిశగా ప్రయత్నం చేయాలని అన్నారు. ఎన్నో సంక్లిష్టతల మధ్య 127 కోట్ల జనాభా ఉన్న దేశంలో కేవలం లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ పార్టీలు మాత్రమే మార్పు తేలేవని, ఇప్పటికే పాతుకుపోయి ఉన్న పార్టీలు కూడా ఈ మార్పు ప్రక్రియలో భాగస్వాములైతే మెరుగైన రాజకీయం త్వరగా సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల ఫలితాలు మారుతుంటాయని, కానీ రాజకీయ భావజాలం మారితేనే శాశ్వత మార్పు వస్తుందని, అందుకే కొత్త రాజకీయ భావజాలం దిశగా అన్ని పార్టీలూ కృషి చేయాలన్నారు. ఢిల్లీ ఎన్నికలలో ఫలితాలు సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ సుపరిపాలనలో కూడా ఆ రీతిలో ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాజకీయాలలో పాలుపంచుకోవటానికి, ఓటు వేయటానికి ఈ ఎన్నికలలో యువత, మహిళలు పెద్దసంఖ్యలో ముందుకు రావటం శుభపరిణామమన్నారు.

**నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి జయప్రకాష్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ...** ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఎవరికి ఓటు వేసినా, కాంగ్రెస్ పార్టీని మాత్రం క్షమించకూడదని, తరిమితరిమి కొట్టాలని ప్రజలు భావిస్తున్నట్టు ఈ ఎన్నికల ఫలితాలు నిర్ద్వంద్వంగా రుజువుచేశాయని, ఇక ఒక్కరోజు కూడా అధికారంలో ఉండే నైతిక హక్కు యూపీయే ప్రభుత్వానికి లేదని, ప్రధాని మన్మోహన్ సింగ్ ఎంత త్వరగా పదవిని వీడితే ఈ దేశ పునర్నిర్మాణానికి అంత త్వరగా మార్గం ఏర్పడుతుందని అన్నారు. **మన్మోహన్ సింగ్ ఇప్పుడేమన్నా చేయాలనుకున్నా సమయం మించిపోయిందని, ఈ దేశానికి ఏమైనా మేలు చేయాలనుకుంటే తక్షణం రాజీనామా చేసి పార్లమెంటుని రద్దు చేసి ఎన్నికలు జరపాలని** డిమాండ్ చేశారు. 1977 తర్వాత ఇందిరాగాంధీ హత్యానంతర అసాధారణ సందర్భంలో తప్ప కేంద్రంలో రెండోసారి ఒకే పార్టీకి దేశ ప్రజలు ఎప్పుడూ పట్టం కట్టలేదని, అలాంటిది 32 ఏళ్ల తర్వాత ఎంతో కీలకమైన 2009లో యూపీయే ప్రభుత్వానికి ఎన్నో ఆశలతో అధికారాన్ని అప్పగిస్తే దుష్టపాలనతో, అసమర్థ విధానాలు, వారసత్వ రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం, విశృంఖల అవినీతితో వారి ఆశల్ని వమ్ముచేశారని అన్నారు.

యూపీయే పాలనను అంశాల వారీగా జేపీ తూర్పారపట్టారు. పేరుకు ప్రజల కోసం పెద్దపెద్ద కార్యక్రమాలు చేపడుతున్నట్టు నటిస్తూ యూపీయే మభ్యపెడుతూ వచ్చిందని, విద్యాహక్కు చట్టంతో ఆర్భాటం తప్ప ఉపాధి అవకాశాలకు,



పేదరిక నిర్మూలనకి కీలకమైన నాణ్యమైన విద్యను అందించేందుకు కనీస ప్రయత్నం చేయలేదని అన్నారు. విద్యాప్రమాణాలలో ప్రపంచంలోని 74 దేశాలలో మన దేశం దాదాపు అట్టడుగున 73వ స్థానంలో ఉందన్నారు. అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రజారోగ్యానికి జీడీపీలో 3శాతం కేటాయిస్తామని 2004లో హామీ ఇచ్చి ఇప్పటికీ 1 శాతాన్నే ఇస్తోందని, ఆ నిధుల్ని కూడా తప్పుడు పద్ధతుల్లో కేటాయిస్తోందన్నారు. ఎంతో ప్రధానమైన విద్యుత్ రంగాన్ని భయంకర సంక్షోభంలోకి నెట్టిందని, రూ.4,80,000 కోట్ల విలువైన విద్యుత్ ప్రాజెక్టులు నిలిచిపోయాయని, పంపిణీలో రూ.1లక్షా 50 వేల కోట్ల విలువైన విద్యుత్ వృధాగా పోతోందని, స్వదేశంలో పుష్కలంగా బగ్గు దిగుబడులున్నా 16 కోట్ల టన్నుల బగ్గును దిగుమతి చేసుకుంటోందని, పూర్తయిన ప్రాజెక్టులకు ఇంధనం సరఫరా లేదని అన్నారు. ఏడాదికి 1 కోటి ఉద్యోగాలు అవసరమైతే, కేవలం 1 లక్ష ఉద్యోగాలతో సరిపుచ్చుతోందని, పొరుగున ఉన్న చైనా 20 ఏళ్లలో 20 కోట్ల ఉద్యోగాలను సృష్టించినా యూపీయేకు జ్ఞానోదయం కలగలేదన్నారు. అధికారాన్ని మొత్తం కేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలలో ప్రజల జీవితాల్ని దుర్భరంగా మార్చారన్నారు. పెద్ద ఎత్తున వనరులు అందుబాటులోకి వస్తే అవినీతి సామ్రాట్లులుగా తయారై వాటిని దోచుకున్నారన్నారు.

**ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీలాగా లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు విజయం సాధించలేకపోయింది** అన్న ప్రశ్నకు జేపీ జవాబిస్తూ, లోక్‌సత్తా ఒక ఉద్యమంగా, పార్టీగా 17 ఏళ్లుగా విద్య, ఆరోగ్యం, ఉపాధి, లాభసాటి వ్యవసాయం, అధికార వికేంద్రీకరణ, అవినీతి నిర్మూలన, న్యాయ సంస్కరణలు వంటి కీలకాంశాల కోసం పోరాడుతోందని, దేశంలోనే సాటిలేని అనేక విజయాలను కూడా సాధించిందని, అయితే గతంలో పోలిస్తే మార్పుకి పరిస్థితులు ఇప్పుడు అనుకూలంగా మారుతున్నాయని అన్నారు. అలాగే, ఢిల్లీలో అత్యంత ఎక్కువ తలసరి ఆదాయం ఉండటం, దేశ రాజధాని కావటం, కులం, ప్రాంతం వంటి భావాలు తక్కువగా ఉన్నాయని, అదే ఆంధ్రప్రదేశ్‌లో సాంప్రదాయ పార్టీలు కులం, మతం, ప్రాంతం, భాష వంటి వాటి ప్రాతిపదికన ప్రజలను నిలువునా చీల్చారని, ఓట్ల కొనుగోలుకు డబ్బు, మద్యం, తాత్కాలిక పథకాల్ని ఇస్తున్నారని అన్నారు. మరోవైపు, లోక్‌సత్తా ఎన్నో పెద్ద విజయాలను సాధిస్తున్నా ఆద్మీ పార్టీ లాగా మార్కెట్ చేసుకోవటంలో విఫలమైందన్నారు. పేదల కోసం చాలా ఎక్కువ కృషి చేస్తున్నది లోక్‌సత్తా అని, అయితే చేస్తున్న పనిని, సాధించిన విజయాలను ప్రచారం చేసుకోవటం పేలవంగా ఉండటంతో ప్రజలను చేరుకోవటంలో వెనకబడి ఉన్నామన్నారు. మార్కెటింగ్‌లో, పేదలను చేరటంలో ఆమ్ ఆద్మీ పార్టీ లాగా దూకుడుగా ఉండటం లోక్‌సత్తా కూడా నేర్చుకుంటుందన్నారు. ఏదోకరకంగా మౌలిక లక్ష్యాల సాధనకే పరిమితంకాకుండా అందుకోసం అధికారాన్ని సాధించటం మీద దృష్టి పెడతామన్నారు.

**వచ్చే ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయటమే లోక్‌సత్తా ఆశయమని,** అయితే రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పొత్తుల గురించి కూడా ఆలోచించాల్సి రావచ్చని జేపీ ఒక ప్రశ్నకు జవాబిచ్చారు. ఒకవేళ పొత్తులుంటే లోక్‌సత్తా లక్ష్యాల ప్రాతిపదికనే ఉంటాయని తెలిపారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.వి.ఎస్ వర్మ, వై.డి రామారావు, ప్రధాన కార్యదర్శి రవి మారుత్, క్రమశిక్షణా సంఘం కార్యదర్శి ఎల్. వి రామరాజు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ■

| మధ్యప్రదేశ్ (మొత్తం స్థానాలు-230) | | | ఛత్తీస్‌గఢ్ (మొత్తం స్థానాలు-90) | | | రాజస్థాన్ (మొత్తం-200, పోలింగ్-199) | | | ఢిల్లీ (మొత్తం స్థానాలు-70) | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| పార్టీ | ఆధిక్యం | గెలుపు | పార్టీ | ఆధిక్యం | గెలుపు | పార్టీ | ఆధిక్యం | గెలుపు | పార్టీ | ఆధిక్యం | గెలుపు |
| భాజపా | 0 | 165 | భాజపా | 0 | 49 | కాంగ్రెస్ | 0 | 21 | కాంగ్రెస్ | 0 | 8 |
| కాంగ్రెస్ | 0 | 58 | కాంగ్రెస్ | 0 | 39 | భాజపా | 0 | 162 | భాజపా | 0 | 32 |
| బి.ఎస్.పి. | 0 | 3 | బి.ఎస్.పి. | 0 | 1 | బి.ఎస్.పి. | 0 | 3 | ఎ.ఎ.పి. | 0 | 28 |
| ఇతరులు | 0 | 4 | ఇతరులు | 0 | 1 | ఇతరులు | 0 | 13 | ఇతరులు | 0 | 2 |

# 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

## మధ్యప్రదేశ్‌లో భాజపా హ్యాట్రిక్

సాధారణంగా సుదీర్ఘకాలం అధికారంలో ఉండే ప్రభుత్వంపై ప్రజలకు అసంతృప్తి ఎక్కువగా వుంటుంది. అయితే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి చౌహాన్ మాత్రం సుపరిపాలనతో రాష్ట్ర ప్రజల అభిమానాన్ని పొందారు. 2003, 2008, ప్రస్తుత ఎన్నికల్లో భాజపా హ్యాట్రిక్ విజయానికి చౌహాన్ క్రియాశీలకంగా వ్యవహరించారు.

**పథకాల వెల్లువ**

చౌహాన్ 2005లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచే వినూత్న పథకాలతో ఆయన ప్రజలకు చేరువయ్యారు. 'బిమారు' రాష్ట్రాల్లో ఒకటిగా వున్న మధ్యప్రదేశ్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేశారు. లక్ష్మీలాడ్లీ యోజన పథకంలో ఆడపిల్లలకు పుట్టినప్పుడే కొంత డబ్బును బ్యాంక్‌లో డిపాజిట్ చేసే పథకాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ పథకం ప్రాచుర్యం పొందింది.

**మౌలిక సౌకర్యాల ఏర్పాటు**

హార్ట్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన మధ్యప్రదేశ్‌లో మౌలిక సౌకర్యాల కొరత అధికంగా వుండేది. చౌహాన్ అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం రాష్ట్రంలో రోడ్లను బాగా విస్తరించారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడింది. దీంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించే అవకాశం ఏర్పడింది.

**కాంగ్రెస్‌ను మళ్లీ తిరస్కరించిన ఓటర్లు**

భాజపాను ఓడించి మధ్యప్రదేశ్‌లో తిరిగి అధికారం పొందాలనుకున్న కాంగ్రెస్‌కు ఈసారి కూడా ఘోరపరాభవం తప్పలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ... తదితరులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా రాష్ట్రంలో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. కానీ ఇవేవీ ప్రజల తీర్పును ప్రభావితం చేయలేకపోయాయి.

## ఢిల్లీలో హంగ్.. భాజపాకు ఎక్కువ స్థానాలు

దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలు కురుక్షేత్రాన్ని తలపించాయి. 15 సంవత్సరాల నుంచి అధికారంలో వున్న కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. సామాన్యుడి అజెండాతో కేజ్రీవాల్ సారథ్యంలో ఎన్నికల బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభావశక్తిగా అవతరించింది. 15 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం అధికారాన్ని అందుకోవాలన్న భాజపా ప్రభుత్వ స్థాపనకు అవసరమైన మేజిక్ సంఖ్యను సాధించలేకపోవడం గమనార్హం.

**సామాన్యుడి శక్తి... ఆమ్ ఆద్మీ**

నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత.. తదితర అంశాలే ప్రాతిపదికగా బరిలోకి దిగిన ఆమ్ ఆద్మీ పార్టీకి ఢిల్లీ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దేశంలో ప్రధాన రాజకీయపక్షాలైన భాజపా, కాంగ్రెస్‌లకు గట్టిపోటీనిచ్చి మంచి ఫలితాలను రాబట్టింది.

**యువకెరటం**

ఈ ఎన్నికల్లో కొత్తగా ఓట్లు పొందిన నవయువ ఓటర్లు ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎక్కువమంది విద్యావంతులున్నప్పటికీ ఓటింగ్‌కు దూరంగా వుండే ఢిల్లీ ప్రజానీకం ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు భారీగా తరలివచ్చింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు కూడా పోలింగ్ జరగడం విశేషం.

**షీలాదీక్షిత్ పాలన విమర్శలమయం**

ఢిల్లీని గత 15 సంవత్సరాల నుంచి పాలిస్తున్న షీలాదీక్షిత్ పాలనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కామన్వెల్త్ క్రీడల కుంభకోణంతో పాటు నిర్భయ ఉదంతం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్య ప్రజానీకంపై ప్రభావాన్ని చూపాయి. దీంతో వారు ఓట్ల రూపంలో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాగ్రహ ఉప్పెనలో ముఖ్యమంత్రి షీలాదీక్షిత్‌తో పాటు పలువురు మంత్రులు ఓటమి పాలయ్యారు. దీంతో కాంగ్రెస్ కనీసం పదిమంది సభ్యులను కూడా గెలిపించుకోలేకపోయింది.

### అధికారానికి దగ్గరగా వచ్చిన భాజపా

15 సంవత్సరాల నుంచి ప్రతిపక్ష పాత్రకే పరిమితమయిన భాజపా ఈసారి ఎలాగైనా అధికారాన్ని దక్కించుకునేందుకు సుదీర్ఘమైన కసరత్తు చేసింది. సీనియర్ నేత విజయ్‌గోయల్‌ను కాదని నిజాయితీపరుడిగా పేరొందిన హర్షవర్ధన్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించింది. అయితే మెజార్టీ సాధించలేక అసెంబ్లీలో అధిక స్థానాలున్న పార్టీగా అవతరించింది.

## ఛత్తీస్‌గఢ్.. హోరాహోరీలో రమణ్‌సింగ్ విజేత

ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 స్థానాలున్న అసెంబ్లీలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైన వెంటనే విజయం రెండువైపుల దోబూచులాడింది. నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన కౌంటింగ్‌లో ఓటరు చివరకు భాజపా వైపు మొగ్గు చూపడంతో ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ సారధ్యంలోని భాజపా ప్రభుత్వం వరుసగా హ్యాట్రిక్ విజయాన్ని సాధించింది.

### చావల్ బాబాకు తగ్గని ఆదరణ

రూపాయికే కిలో బియ్యాన్ని ప్రవేశపెట్టి 'చావల్ బాబా'గా పేరుపొందిన రమణ్‌సింగ్ ఎన్నికల్లో మూడోసారి విజయాన్ని సాధించడంతో రాష్ట్ర ప్రజల్లో ఆయనకున్న ఆదరణ సడల లేదని తేలింది. దేశంలోనే సమర్థమైన ప్రజాపంపిణీ పథకాన్ని ఆయన కొన్నేళ్ల కిందట ప్రారంభించారు.

### ఫలించని కాంగ్రెస్ వ్యూహం

దశాబ్దానికి పైగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ ఈ సారైనా అధికారాన్ని అందుకోవాలని పలు వ్యూహాలను అమలు చేసింది. కొద్ది నెలల క్రితం మావోయిస్టుల దాడిలో రాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన కీలకనాయకులు ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతితో వెల్లువెత్తిన సానుభూతితో ఓట్లు పొందాలని కాంగ్రెస్ యత్నించింది. అయితే సానుభూతిని ఓట్ల రూపంలో మల్చుకోవడంలో విఫలమైంది.

## రాజస్థాన్‌లో మళ్లీ 'రాజే'

ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా సీఎం అభ్యర్థి వసుంధరా రాజే సింధియా ప్రభంజనం సృష్టించారు. కమలదళం సుడిగాలిలో గెహ్లాట్ సారధ్యంలోని కాంగ్రెస్ సర్కారు కొట్టుకుపోయింది. ప్రతి ఐదేళ్లకు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వాలను మార్చే సంప్రదాయం ఉన్న రాజస్థాన్ ఓటరు ఆ విధానాన్నే అనుసరించాడు. అయితే భాజపా సాధారణ మెజార్టీతో కాకుండా అద్వితీయమైన మెజార్టీతో అధికారంలోకి రావడం గమనార్హం.

### అన్నీ తానై..

2008లో భాజపా ఓటమి అనంతరం కొన్ని రోజులు పాటు ఢిల్లీ రాజకీయాలకు పరిమితమైన వసుంధరా రాజే సింధియా రాష్ట్రంలోని భాజపా శ్రేణులకు పెద్ద దిక్కుగా వ్యవహరించారు. తన వ్యవహారశైలిని పూర్తిగా మార్చుకున్నారు. ప్రజలతో, కార్యకర్తలతో మమేకం కావడంతో ప్రజలు ఆమె నాయకత్వంపై తిరిగి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్ సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిపై అవిశ్రాంతంగా ప్రచారం నిర్వహించారు.

### అవినీతి ఆరోపణలతో మునిగిన గెహ్లాట్

రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్ పలు ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టారు. వీటిలో ఉచిత మందుల పంపిణీ పథకానికి మంచి ఆదరణ లభించింది. దీంతో పాటు జైపూర్‌లో మెట్రో రైలు నిర్మాణం, రాష్ట్రంలో రిఫైనరీ నిర్మాణాలను ప్రారంభించారు. అయితే గెహ్లాట్‌పై అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి తోడు నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల ఓటర్లపై ప్రభావాన్ని చూపింది. దీంతో ఓటర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే అత్యంత దయనీయ స్థితిలో ఓడిపోవడం కాంగ్రెస్ శ్రేణులను కలవరపెడుతున్న అంశమే.

## మిజోరంలో హస్తం మెరుపులు

వరదలో కొట్టుకుపోతున్న వానికి ఓ చిన్న ఆసరా దొరికినట్లుగా నాలుగు రాష్ట్రాల్లో ఘోరపరాజయాన్ని చవి చూసిన కాంగ్రెస్‌కు మిజోరం చిరు ఆశాదీపమై నిలిచింది. మొత్తం 40 నియోజక వర్గాలకుగాను 39 స్థానాలకు లెక్కింపు జరగగా 33 స్థానాల్లో తన సత్తాను చాటుకుంది. 2008లో 32 స్థానాల్లో గెలుపొంది అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ బలం మరికొంత పెరిగింది.

ముఖ్యమంత్రి లాల్ తన్‌హవ్లా 1978 నుంచి తొమ్మిది దఫాలుగా ఆయన సెర్చిప్ స్థానం నుంచి ఎన్నికవుతున్నారు. లాల్ తన్‌హవ్లా మంత్రి మండలిలోని 11 మంది మంత్రుల్లో 9 మంది తిరిగి ఎన్నికకావటం విశేషం. ప్రధాన ప్రతిపక్షమైన మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) అయిదు స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. ■

# ఆంధ్రప్రదేశ్‌ని విభజించే ముందు శాసనసభ ఆమోదాన్ని తీసుకోవాలి: రాష్ట్రపతికి జేపీ లేఖ

ఆంధ్రప్రదేశ్ విభజనకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 కింద బిల్లుని ప్రవేశపెట్టే ముందు రాష్ట్ర శాసనసభ ఆమోదాన్ని తీసుకోవాలని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కోరారు.

''రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయాలతో పనిలేకుండా ఆంధ్రప్రదేశ్‌ని విభజించేస్తామని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో చేస్తున్న ప్రయత్నాలు, పదేపదే చేస్తున్న ప్రకటనలు భారతదేశ ఫెడరలిజానికి, ఐక్యతకు పెనుప్రమాదంగా పరిణమిస్తాయి" అని జేపీ ఆందోళన వ్యక్తం చేశారు. **ఈమేరకు రాష్ట్రపతికి జేపీ రాసిన లేఖను లోక్‌సత్తా పార్టీ వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.**

"రాష్ట్రపతిగా మీరు రిపబ్లిక్‌కు అధిపతి మాత్రమే కాదు, పార్లమెంటులో భాగం కూడా. పార్లమెంటు ఉభయ సభల ద్వారా, రాష్ట్ర శాసనసభల సభ్యుల ద్వారా ఎన్నికైన మీరు, కేంద్రానికి, రాష్ట్రాలకు కూడా ప్రాతినిధ్యం వహిస్తారు. సుప్రీంకోర్టుతోపాటు మీరు రాజ్యాంగానికి, ఫెడరలిజానికి అంతిమ పరిరక్షకులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించేందుకు ప్రవేశపెట్టే ఏ బిల్లుకైనా సిఫార్సు చేసే ముందు రాష్ట్రపతి తన రాజ్యాంగబద్ధ విధిని స్వతంత్రంగా నిర్వర్తించాల్సిన సందర్భమిది. ఇది ఆంధ్రప్రదేశ్‌కి మాత్రమే కాకుండా మన ఫెడరల్ రాజ్యాంగానికి, భారతదేశానికి కూడా కీలక సందర్భం. ఆర్టికల్ 3 కింద బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఆమోదం తీసుకోవాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము" అని జేపీ తన లేఖలో రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.

**రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి జయప్రకాష్ నారాయణ్ రాసిన లేఖ స్థూల పాఠం...**

"గౌరవనీయులైన రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ గార్కి,

ఆంధ్రప్రదేశ్‌ని విభజించాలని అక్టోబర్ 3న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, తదనంతర పరిణామాలు భారతదేశ ఫెడరలిజం మీద, దేశ భవిష్యత్తు మీద కీలక ప్రశ్నల్ని లేవనెత్తుతున్నాయి. 1950 తర్వాత అనేక రాష్ట్రాలు ఏర్పడ్డాయిగానీ రాష్ట్ర శాసన సభ ఆమోదం లేకుండా, విస్తృతస్థాయిలో వివిధ వర్గాల ప్రజానీకం నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెతుతున్న నేపథ్యంలో కూడా ఈ అంశంతో ముడిపడిన వివిధ వర్గాల, ప్రాంతాల మధ్య చర్చలు జరిపి సామరస్య పరిష్కారం సాధించకుండా ఒక పెద్ద రాష్ట్రాన్ని విభజించే ప్రయత్నం చేయటం ఇదే మొదటిసారి.

దురదృష్టవశాత్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలో– తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలో తీవ్ర భావోద్వేగపూరితమైన వాతావరణం నెలకొంది. ఆదిమ మానవ భావాల్ని, ఆటవిక ఆందోళనల్ని రెచ్చగొడితే మనం వినాశానికే దోహదం చేస్తున్నట్లు లెక్క. కదిలించ వీలులేని వస్తువు, ఆప తరంగాని శక్తి ఢీకొట్టుకోకుండా మనం సర్వశక్తులూ ఒడ్డి ఆపాలని మనకు చరిత్ర చెబుతున్న పాఠం.

ఒక రాష్ట్ర సరిహద్దుల్ని ముందుగా ఆమోదం తీసుకోకుండా మార్చటం సాధ్యం కాదనే నిబంధనని అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, స్విట్జర్లాండ్, బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో వంటి అన్ని పెద్ద ప్రజాస్వామ్య దేశాలూ తమ రాజ్యాంగాలలో పొందుపరుచుకున్నాయి. లిఖిత రాజ్యాంగం లేకుండా ఏకస్వామ్య దేశంగా ఉన్న బ్రిటన్ (యూకే) కూడా స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌లో సాధికారత గల ప్రాంతీయ చట్టసభలతో ఫెడరల్ దేశంగా రూపొందుతోంది. చివరికి పాకిస్తాన్ కూడా తన ఫెడరల్ నిర్మాణాన్ని కాపాడుకుంది. తమిళం మాట్లాడే ప్రజల ఆకాంక్షలకి చోటు కల్పించేలా ఫెడరల్ నమూనాని వ్యవస్థాగతం చేసేందుకు శ్రీలంక కూడా చర్యలు ప్రారంభించింది.

మనదేశంలో స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో – భారత, పాకిస్తాన్ విభజన సందర్భంగా జరిగిన భయానక ఘటనలు, వివిధ రకాల రాష్ట్రాలు (ఎ, బి, సి విభాగాలు) ఉనికిలో ఉండటం, 552 సంస్థానాలను పూర్తిగా విలీనం చేయాల్సిన ఆవశ్యకత – కారణాల వల్ల ఒక రాష్ట్ర సరిహద్దులు మార్చే ముందు ఆ రాష్ట్ర అంగీకారం తప్పనిసరి కానక్కర్లేదనే ఏర్పాటుని మన రాజ్యాంగ నిర్మాతలు విజ్ఞతతో చేశారు. అదేసమయంలో, 1950 నుంచి అటు పార్లమెంటు, ఇటు ప్రభుత్వాలు కూడా కొత్త రాష్ట్రాల ఏర్పాటు విషయంలో ఎంతో సంయమనంతో, విజ్ఞతతో వ్యవహరించాయి. 1987 వరకూ 20 చట్టాలు చేశారని చెబుతూ సర్కారియా కమిషన్ ఈ విధంగా పేర్కొంది: ... "ఈ చట్టాల్ని విభజనకప్రభావానికి గురయ్యే

రాష్ట్రాల సమ్మతితోగానీ, లేదా అందుకోసమే ప్రత్యేకించి ఏర్పాటైన కమిషన్ లేదా కమిటీ సిఫార్సుల ప్రాతిపదికన గానీ చేశారు". 1987 తర్వాతా అదే విధానం కొనసాగింది. గోవా, పాండిచ్చేరి వంటి కేంద్రపాలిత ప్రాంతాల విషయంలో కూడా, ప్రజల, వారి ప్రతినిధుల ఆకాంక్షల్ని గౌరవించారు. కొత్త రాష్ట్రాలుగా జార్ఖండ్, ఉత్తరాంచల్, ఛత్తీస్‌గఢ్‌లను ఏర్పాటు చేసే ముందు కూడా శాసనసభల ఆమోదాన్ని తీసుకున్నారు.

పూంఛి కమిషన్ (2010) ఇలా పేర్కొంది: "రాష్ట్రాల అభిప్రాయాలను పార్లమెంటు పట్టించుకోకపోవటం ఆచరణలో అరుదుగా మాత్రమే సాధ్యమవుతుంది. ప్రత్యేక రాష్ట్రం కావాలన్న గ్రూపుల/ కమ్యూనిటీల డిమాండ్‌కు సంబంధించి, అవి పనిచేస్తున్న రాష్ట్రం లేదా రాష్ట్రాల నుంచి ప్రతిపాదన రాకుండా ఆ డిమాండ్‌కు తలగ్గి కేంద్ర ప్రభుత్వం వ్యవహరించలేదు". ఉత్తర ప్రదేశ్ విషయంలో జరిగినట్టు, కేంద్రం రాష్ట్ర శాసనసభ అభ్యర్థనను గౌరవించాల్సిన పన్లేదుగానీ, ఏదైనా అసాధారణమైన, అనివార్యమైన జాతీయ ప్రయోజనాల ప్రాధాన్యత దృష్ట్యా పార్లమెంటు వ్యవహరించాల్సి వస్తే తప్ప, రాష్ట్ర శానన నభ అంగీకారం లేకుండా కేంద్రం వ్యవహరించలేదనేది స్థిరపడిన ఆనవాయితీ.

రాజ్యాంగ చట్టం ప్రకారం, ఆచరణలో స్థిరపడిన ఆనవాయితీల ప్రకారం, ఒక రాష్ట్రాన్ని విభజించేటప్పుడు ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదం తప్పనిసరి. అటువంటి పరిణతి, విజ్ఞత గడచిన ఆరు దశాబ్దాలుగా మనకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటూ వచ్చింది.

రిపబ్లిక్ చరిత్రలో మునుపెన్నడూ లేనంత ఫెడరల్ స్వభావాన్ని భారతదేశం ఈవేళ సంతరించుకుంది. ఒకే దేశం, ఒకే పౌరసత్వం, దేశ ప్రాదేశిక సమగ్రత ఛత్రంలో రాష్ట్రాలు కూడా పరిమిత సార్వభౌమాధికారాన్ని ప్రదర్శిస్తాయి. మన రాజ్యాంగం పనితీరు ఈ ఫెడరల్ స్ఫూర్తికి అద్దం పడుతుంది. రాష్ట్రాల్ని మునిసిపాలిటీలుగా చేసి, వాటి రాజకీయ మనుగడ కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు, ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉండేలా చేయాలన్నది ఎన్నడూ రాజ్యాంగ అభిమతం కాదు.

అయితే, తీవ్రస్థాయి పరస్పర విరుద్ధ డిమాండ్లతో ఒక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు చీలిపోయిన పరిస్థితులలో కేంద్రం నిస్సహాయ ప్రేక్షక పాత్ర పోషించకూడదు. అటువంటి పరిస్థితులలో, అందరినీ సంతృప్తి పరిచేలా లేదా అందరికీ అసంతృప్తి కనీసస్థాయిలో ఉండేలా చర్చల ద్వారా పరిష్కారం జరిగే ప్రక్రియకి కేంద్ర ప్రభుత్వం దోహదం చేయాలి.

ఆంధ్రప్రదేశ్ అప్పటి ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీ, అప్పటి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభ ముందస్తు ఆమోదంతోనే ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్రం కోసం మూడు ప్రాంతాలలో రెండు ప్రజాదరణ పొందిన ఉద్యమాలు - 1969-70లో తెలంగాణలో, 1972-73లో కోస్తాంధ్ర, రాయలసీమలో తలెత్తినప్పుడు చర్చల ద్వారా ఒక స్థూల ఏకాభిప్రాయ పరిష్కారం వచ్చేలా అన్ని ప్రాంతాలనూ కేంద్రప్రభుత్వమే ప్రోత్సహించింది. ఆ పరిష్కారానికనుగుణంగా, అన్ని ప్రాంతాల ప్రయోజనాలనూ పరిరక్షించటానికి తగిన రాజ్యాంగ రక్షణలనూ ఏర్పాటు చేసింది. స్పష్టమైన బహిరంగ ఒప్పందం ప్రాతిపదికన రాష్ట్రం సమైక్యంగా ఉంటుందనే లక్షలాది ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి రాజధాని హైదరాబాద్‌కి వచ్చి తమ జీవితాల్ని, జీవనోపాధుల్ని నిర్మించుకున్నారు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని నిర్మించారు.

గ్రేటర్ హైదరాబాద్ నగరం వెలుపల తెలంగాణ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకి పెద్దఎత్తున మద్దతు ఉందనటంలో ఎటువంటి సందేహం లేదు. అదేరీతిలో, రాష్ట్ర విభజన పట్ల భారీస్థాయి వ్యతిరేకత కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో, హైదరాబాద్ నగరంలో ఉంది. కాబట్టి, సరిహద్దుల్ని మళ్లీ మార్చాలంటే, ఈ ప్రభావానికి గురయ్యే వర్గాలు ఓపిగ్గా చర్చలు జరిపి మరో ఒప్పందానికి రావాలి. ఈ క్రమంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాల్ని సామరస్యంగా సమన్వయం చేసేందుకు కేంద్రం తోడ్పాటునిచ్చి కీలకపాత్ర పోషించాలి. ఒక విజేతల బృందాన్ని, అంతకంటే పెద్ద పరాజితుల బృందాన్ని తయారుచేయటం కాదుగదా కేంద్రం చేయాల్సిన పని! రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయాలతో పనిలేకుండా ఆంధ్రప్రదేశ్‌ని విభజించేస్తామని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో చేస్తున్న ప్రయత్నాలు, పదేపదే చేస్తున్న ప్రకటనలు భారతదేశ ఫెడరలిజానికి, ఐక్యతకు పెనుప్రమాదంగా పరిణమిస్తుంది.

రాష్ట్రపతిగా మీరు రిపబ్లిక్‌కు అధిపతి మాత్రమే కాదు, పార్లమెంటులో భాగం కూడా. పార్లమెంటు ఉభయ సభల ద్వారా, రాష్ట్ర శాసనసభల సభ్యుల ద్వారా ఎన్నికైన మీరు, కేంద్రానికి, రాష్ట్రాలకు కూడా ప్రాతినిధ్యం వహిస్తారు. సుప్రీంకోర్టుతోపాటు మీరు రాజ్యాంగానికి, ఫెడరలిజానికి అంతిమ పరిరక్షకులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించేందుకు ప్రవేశపెట్టే ఏ బిల్లుకైనా సిఫార్సు చేసే ముందు రాష్ట్రపతి తన రాజ్యాంగబద్ధ విధిని స్వతంత్రంగా నిర్వర్తించాల్సిన సందర్భమిది. ఇది ఆంధ్రప్రదేశ్‌కి మాత్రమే కాకుండా మన ఫెడరల్ రాజ్యాంగానికి, భారతదేశానికి కూడా కీలక సందర్భం. ఆర్టికల్ 3 కింద బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు ఆంధ్రప్రదేశ్ శానన నభ ఆమోదం తీనుకోవాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము. ■

# విభజన నిర్ణయం తెలుగు గడ్డపైనే తేలాలి

- బలవంతంగా రుద్దితే సహించం
- కేంద్రంపై నిప్పులు చెరిగిన డా॥ జేపీ
- జేపీతో సమైక్య రాష్ట్ర పరిరక్షణ వేదిక నేతల భేటీ
- అధికరణ-3పై జాతీయ విధానం రావాలి

రాష్ట్రం కలిసి ఉండాలా, విడిపోవాలా.. అన్న విషయాల్ని తేల్చాల్సింది ఢిల్లీ పాలకులు కాదని, రాష్ట్ర భవిష్యత్తు తెలుగుగడ్డపై తెలుగు ప్రజల మధ్యే జరగాలన్న వాస్తవాన్ని రాయల తెలంగాణ ప్రతిపాదన నేపథ్యంలో అయినా తెలంగాణవాదులు గుర్తించాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. రాష్ట్ర విభజనపై ఢిల్లీ పాలకులు తాత్కాలిక రాజకీయలబ్ధికి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. "ఏకపక్ష నిర్ణయాల్ని బలవంతంగా రుద్దితే సహించేది లేదు. పాలకులు చక్రవర్తుల్లా రాచరికాన్ని చలాయించాలని చూస్తే అది దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం. ఇలాంటి వైఖరిని ప్రతిఘటిస్తాం. సమాఖ్యస్ఫూర్తి కోసం, తెలుగుప్రజల పరిరక్షణకు, రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతాం" అని హెచ్చరించారు. సమైక్య రాష్ట్ర పరిరక్షణ వేదిక ఛైర్మన్, ఏపీఎన్జీఓల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు నేతృత్వంలో వేదిక ప్రతినిధులు జేపీతో సమావేశం అయ్యారు. రాజ్యాంగ విరుద్ధంగా, అప్రజాస్వామికంగా కేంద్రం వ్యవహరిస్తోందని.. శాసనసభలో విభజన బిల్లును లోక్‌సత్తా వ్యతిరేకించాలని జేపీని కోరారు. అనంతరం విలేకరులతో జేపీ మాట్లాడుతూ.. ఇప్పటివరకు దేశంలో కొత్తగా ఏ రాష్ట్రం కూడా ఆయా అసెంబ్లీల ఆమోదం లేకుండా ఏర్పడలేదని, రాష్ట్రం విషయంలో కేంద్రం ఇందుకు భిన్నంగా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని నిప్పులు చెరిగారు. విభజన జరగాలని కోరుకోవడంతో తప్పులేదన్నారు. అయితే, ఢిల్లీ పాలకులకు పెత్తనం అప్పగిస్తే పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిన చందంగా ఉంటుందని, రాయల తెలంగాణ వంటి ప్రతిపాదనల్ని తెరపైకి తెస్తున్న విషయాన్ని తెలంగాణవాదులు గుర్తించాలని.. అధికారం కోసం తప్ప ప్రజల బతుకుల్ని బాగుచేసే నిర్ణయాలు తీసుకోరని జేపీ అన్నారు. రాష్ట్ర ప్రజల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్రం సమాఖ్యస్ఫూర్తిని కుళ్లబొడిచే ప్రయత్నాలు చేస్తే.. శాసనసభతో పాటు ఇతర వేదికలపై లోక్‌సత్తా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

### శాంతియుతంగా ఉద్యమిస్తాం

రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచేందుకు శాంతియుతంగా ఉద్యమిస్తామని అశోక్‌బాబు చెప్పారు. తమ పోరాటం తెలంగాణవాదానికి వ్యతిరేకమే తప్ప.. తెలంగాణ ప్రజలపై కాదని, మూడు ప్రాంతాలతో కలిసి అభివృద్ధిని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. విభజనపై పూర్తి అధికారాలు కేంద్రానికే ఉంటాయంటున్న తెలంగాణవాదులు.. రాయల తెలంగాణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలని, ఆ వాదన ప్రకారం రాయలనూ తెలంగాణవాదులు అంగీకరించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో వేదిక నేతలు చలసాని శ్రీనివాస్, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ■



# స.హ. చట్టం అమలుపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

**- పి.వి.గోపాలకృష్ణ,** అడ్వకేట్




అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ (కేంద్ర ప్రభుత్వం) 1966లో ఫ్రీడం ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ చట్టం చేసింది. గత నలభై ఏడేళ్ళలో చాలా మార్పులు చేర్పులు చేసారు. 1996లో క్లింటన్ ప్రభుత్వం ద్వారా ఎలక్ట్రానిక్ రీడింగ్ రూంలు అందుబాటులోకి తెచ్చిన Electronic Freedom of information Act Amendments, బుష్ ప్రభుత్వం 2007లో చేసిన ఒపెన్ గవర్నమెంట్ చట్టం OPEN (Openness Promotes Effectiveness in our National) GOVERNMENT Act, 2007 వంటి మార్పులు చూస్తే, ఫ్రీడం ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ కాంక్షించే ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏ విధమైన చట్టాలు చేస్తాయో అర్థం అవుతుంది. రాజ్యాంగం దన్నుతో నడిచే ప్రజాస్వామ్యానికి, స్వపరిపాలనకి, సార్వభౌమత్వానికి అసలు అర్థం ప్రభుత్వ నిర్వహణ తీరుకి లభించే ప్రజామోదం. ఆ ఆమోదం ప్రజలందరికీ ప్రభుత్వం చేసే ప్రతి పనిగురించి, విధానం గురించిన పూర్తి అవగాహనతో కూడుకున్నదిగా ఉండాలి. ఏ విషయం గుప్తంగా ఉండదు. ప్రతి విషయం బహిరంగంగా ఉండాలన్నది ఈ చట్టం ముఖ్య లక్ష్యం. ప్రభుత్వం మరింత పారదర్శకంగానూ, అందుబాటులోను ఉండే విధంగా నిత్యం ప్రజా ప్రతినిధుల సభ (అమెరికాలో కాంగ్రెస్ ఇక్కడ లోక్‌సభ) తగిన మార్పులు చేర్పులు చేస్తుండాలి. ప్రజల అవసరార్థం సమాచారం గాదు, సమాచారం ప్రజల ప్రాథమిక హక్కు అన్న దృష్టితో ప్రభుత్వం నడుచుకోవాలి. ఈ సూత్రాల మీద ఆధారపడి ఉంది OPEN GOVERNMENT Act, 2007.

ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలన్న సూత్రాన్ని అక్కడి ప్రభుత్వం నమ్మడమే కాక ఆచరణలో కూడా పెట్టడం వల్ల అమెరికా ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డ్ అయి ఉన్న సమాచారం చాలా వరకు అక్కడి ప్రజలే కాక ప్రపంచ ప్రజలందరికీ అందుబాటులో ఉంది. ఆ చట్టాల ప్రకారం కొన్ని రకాల సమాచారం ఫీజు చెల్లించి పొందాల్సి ఉంటుంది. దేశరక్షణ, సైనిక దళాలు, విదేశీ వ్యవహారాలు వంటి తొమ్మిది రకాల సమాచారానికి చట్ట మినహాయింపు కూడా ఉంది.

కాలిఫోర్నియా రాష్ట్ర హౌస్ (అసెంబ్లీ)లో 29 స్టాండింగ్ కమిటీలు, అన్నే సెలెక్ట్ కమిటీలు ఉన్నాయి. వ్యవసాయానికి సంబంధించిన కమిటీలో ఆరుగురు సభ్యులున్నారు. నలుగురు డెమోక్రాటిక్ పార్టీవారు, ఇద్దరు రిపబ్లికన్లు. చైర్‌పర్సన్, డెమోక్రాటిక్ పార్టీకి చెందిన మికోల్ పరా (అది 2008లో ప్రస్తుతం 30 స్టాండింగ్ కమిటీలు, 41 సెలెక్ట్ కమిటీలున్నాయి, ఇవికాక సబ్ కమిటీలు, జాయింట్ కమిటీలు, స్పెషల్ కమిటీలు ఉన్నాయి). ఆ కమిటీలలోని సభ్యుల పేర్లు, వారి వివరాలన్నీ కూడా సునాయసంగా తెలుసుకోగలం.

ఇల్లినాయ్ రాష్ట్ర హౌస్‌లో 65 కమిటీలున్నాయి. అడాప్షన్ రిఫాంస్ కమిటీలోని తొమ్మిది మంది సభ్యుల్లో ఐదుగురు డెమోక్రాట్లు, నలుగురు రిపబ్లికన్లు. సారా ఫిజెన్హోల్ట్జ్, డెమోక్రాటిక్ పార్టీకి చెందినామె, చైర్‌పర్సన్. ఆమె నార్త్ ఈస్టర్న్ ఇల్లినాయ్

యూనివర్శిటీ, పొలిటికల్ సైన్స్‌లో బి.ఎ.పట్టా పొందారు. ఈ రాష్ట్ర సెనేట్‌లో, అంటే మన కౌన్సిల్‌కి సమాంతరమైనదనుకోవచ్చు, అందులో అగ్రికల్చర్-కన్సర్వేషన్ కమిటీలో తొమ్మిది మంది సభ్యుల్లో ఐదుగురు డెమోక్రాట్లు, నలుగురు రిపబ్లికన్లు, ఛైర్‌పర్సన్, జాన్ ఎమ్. సులివాన్, క్విన్సీ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ చేసారు.

ఇలా ప్రపంచంలో ఏదో మూలనున్న, మనకి సంబంధం లేని వాళ్ళ గురించి అక్కడికి వెళ్ళక్కర్లేకుండానే మనింట్లో కూర్చుని కాఫీ తాగుతూ మనకి అవసరమైన సమాచారం సంపాదించడం కష్టం కాదు, అరనిమిషంలో, అతి తక్కువ ఖర్చుతో ఇంటర్నెట్ ద్వారా. అంతే కాదు, వెబ్‌కాస్టింగ్ ద్వారా లైవ్‌గా ఆ కమిటీ మీటింగ్‌లని చేసే అవకాశాలున్నాయి. రికార్డింగ్స్ కూడా అందుబాటులో ఉంటాయి.

ఎందుకింతగా చెప్పుకోవలసి వస్తోంది? 2002లో మనం Freedom of Information Act చేసుకున్నాం. ప్రభుత్వం పారదర్శకంగాను, జవాబుదారీగాను ఉండాలన్న ఉద్దేశంతోను, ప్రజలకి దాని అవసరం గుర్తించి కూడ. దాని స్థానంలో 2005 నాటికి సమాచారం ప్రజల హక్కుగా మారి సహ చట్టం రూపుదాల్చింది. కాని అమెరికాతో పోలిస్తే, మన పరిస్థితి, సమాచార హక్కు చట్టం ద్వారా మన ప్రభుత్వాలనుంచి మనం పొందిన దానికన్నా పొందవలసిందే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తుంది. సమాచారం ఓ హక్కు అని కాక ప్రభుత్వ బాధ్యత కూడా అన్నది మనం ఇంకా ఆచరణలో పెట్టవలసి ఉంది. అమెరికా నుంచి మనం నేర్చుకోవలసిన మంచి అది.

హైదరాబాదులో ఉన్నవాడైనా, శ్రీకాకుళంలో ఉన్నవాడైనా మన అసెంబ్లీలో ఎన్ని కమిటీలున్నాయి, వాటిలో సభ్యుల వివరాలు కావాలంటే సడ్రశ (అంటే సమయం, శ్రమ, డబ్బు), ఖర్చు పెట్టుకోవాల్సిందే. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పోర్టల్‌లో చూస్తే పదమూడు కమిటీల లిస్ట్ కనిపిస్తుంది. ఆయా కమిటీలలోని సభ్యులెవరు, వారు ఏ పార్టీలకి చెందినవారు, వారి వివరాలేవీ లేవు. ఇక ఆ కమిటీల సమావేశాలు, తారీఖులు, చర్చించే విషయాలు ఏవీ ప్రజలకి అందుబాటులో లేవు. ఇక వెబ్‌కాస్టింగు ఒక్కటే తక్కువ.

సెక్షన్ నాలుగు, సహ చట్టం కింద ప్రజలు కోరకుండానే చాలా సమాచారం అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. కాని ఉత్తరాలకి, అప్లికేషన్స్‌కే ప్రభుత్వ సమాచారాలావన్నది అనుభవం మీద తెలుస్తుంది. జైళ్ళ శాఖ నుంచి కోరిన ఒక సమాచారం ఇవ్వకపోవడానికి వారిచ్చిన కారణం "పబ్లిక్ ఇన్‌ట్రెస్ట్ లేదు". చట్టంలో ఆ విధమైన కారణాన్ని చూపించి సమాచారం నిరాకరించే అవకాశం లేదు. 2008 నాటి పరిస్థితి అది. ఇప్పుడేమైనా మెరుగు పడిందా అంటే, అడిగిన సమాచారం ఎంత త్వరగా అందిద్దామని కాక, కుంటి సాకులతో సమాచారం ఇవ్వకుండా ఆపే ప్రయత్నమే కనిపిస్తుంది. దరఖాస్తు రుసుం, దాన్ని వసూలు చేసే పద్ధతి, నగదుగానా, డిడిగానా, ఇండియన్ పోస్టల్ ఆర్డరా, కోర్ట్ ఫీ బిళ్ళగానా అన్నది ఒక్కొక్క శాఖది ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకి పంపిన దరఖాస్తుని, ఇండియన్ పోస్టల్ ఆర్డర్ ద్వారా రుసుం చెల్లించడం వల్ల నిరాకరించారు.

చట్టం నిర్దేశించిన విధంగా నెట్‌లో కాకపోయినా, ఆ కార్యాలయంలోనైనా ఆయా శాఖలకి సంబంధించిన విషయాలన్నీ కంప్యూటర్ ద్వారా అందుబాటులో ఉంచడం ప్రభుత్వం బాధ్యత. ఎలక్ట్రానిక్ రీడింగ్ రూంలు ఉద్దేశం అదే.

జలయజ్ఞంలో ఏ ప్రాజెక్ట్ ఏ కాంట్రాక్టర్‌కిచ్చారు, ఆ కాంట్రాక్టర్ పనితనం ఎంత? ఇప్పటిదాకా ఎంత డబ్బు ఖర్చయింది? ఎంత పని పూర్తయింది? ఇంకా ఎంత పని పూర్తికావలసి ఉంది? ఇలాంటి ప్రశ్నలకి జవాబు ఎంత సక్రమంగా, ఎంత త్వరగా వస్తుందన్నది అనుమానమే. కొన్ని సందర్భాల్లో శాసనసభ సభ్యులకే తగిన సమాచారం వెంటనే దొరకని పరిస్థితి చూస్తున్నాం.

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద గత సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఏ హాస్పిటల్స్‌లో ఎవరెవరికి ఏఏ చికిత్సలు జరిగాయి. హాస్పిటల్ వారీగా ఏఏ జబ్బులకి ఎంతెంత ఖర్చయిందన్న సమాచారం ఎవరైనా అడగవలసిన అవసరం లేదు. ఏ సమాచారమైనా అందరికి అందుబాటులో ఉంచడం అన్నది ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత.

గుర్తింపు లేని విద్యాసంస్థలు ఎన్నున్నాయి ఎక్కడున్నాయన్న విషయం సంబంధిత శాఖాధికారులకి ఒక

విద్యార్థి ప్రాణాలు పోయేదాకా తెలీదు. వెంటనే 'నీ జెర్క్ రియాక్షన్'. ఆ శాఖ అటువంటి విద్యాసంస్థలని గుర్తించడానికి ప్రజల సహాయం కూడా కోరింది. మళ్ళీ అంతలోనే నిద్ర. ఆ శాఖ వారం రోజుల్లో పూర్తి చెయ్యాలని చేపట్టిన విచారణ పూర్తయిందా, గుర్తింపులేని విద్యాసంస్థలు ఎన్నని తేల్చింది? ఈ విషయాలు ప్రజలు అడక్కుండానే అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పోర్టర్ ద్వారా డిస్ట్రిక్స్. నిక్. ఇన్‌లో విశాఖపట్నం జిల్లా సైట్లో ఆ జిల్లాలో ముప్పైఒక్క మండలాల్లో ఉన్న అనుమతిలేని విద్యాసంస్థలు పేర్లున్నాయి. మొత్తం 626లో అత్యధికంగా విశాఖ అర్బన్‌లో 143 స్కూళ్ళు, తరువాత స్థానంలో గాజువాకలో 77 స్కూళ్ళు ఉన్నాయి. మిగిలిన జిల్లాల పరిస్థితి చెప్పే నాధుడేడి? ఆయా స్కూళ్ళ యాజమాన్యాలపై తీసుకున్న చర్యలేమిటి? ఆ విద్యార్థుల తల్లిదండ్రులకీ విషయం తెలిసే ప్రచారం ఏ విధంగా జరిగింది? అనుమతి ఉన్న స్కూళ్ళలోనే పిల్లలని చదివించండి, అనుమతి లేని స్కూళ్ళలో చేర్పిస్తే ప్రభుత్వ బాధ్యత లేదు అన్న వెబ్‌సైట్లో ఉన్న హెచ్చరికను చూసే అవకాశం, కంప్యూటర్ జ్ఞానం, ఆ తల్లిదండ్రులలో ఎందరికుంది? అందరికీ అందుబాటులో లేని వెబ్‌సైట్లో ఈ హెచ్చరిక పెట్టి ప్రభుత్వం చేతులు దులుపేసుకుందా? ఆ విద్యార్థుల భవిష్యత్తు సమస్య చక్కదిద్దే బాధ్యత ప్రభుత్వానికి లేదా?

పట్టణ ప్రాంతాలలో పూర్వం చెరువులుగాను, ఇప్పుడు ఇళ్ళ స్థలాలుగా మారిన ప్రదేశాలు, రాష్ట్రం మొత్తం మీద ఇప్పుడింకా మిగిలిన చెరువులున్న ప్రాంతాలను ఎవరూ అడగకుండానే అందరికి తెలియజేయవలసిన బాధ్యత నిజాయితీగా సెంటు భూమి ఐదువందలకి కొని గ్రౌండు (2400 చదరపు అడుగులు) యాభైవేలకు అమ్మి లాభాలార్జించే రియల్ ఎస్టేట్ వ్యాపారిదా? ఆ లాభాల్లో వాటాలెవరెవరికి అన్న సమాచారం పెరుమాళ్ళుకందే వాటా ద్వారా తెలుస్తుందా?

23 జిల్లాల్లో 13 జిల్లాలు మాత్రమే నిక్.ఇన్ కి అనుసంధానమై ఉన్నాయి. రోగి కోరినది వైద్యుడివ్వడు. వైద్యుడిచ్చింది రోగికి సహించదు. ఈ పరిస్థితి ప్రస్తు మన సమాచార హక్కుకి చక్కగా సరిపో(లు)తుంది.

మనకక్కావలసింది వాళ్ళివ్వరు. వాళ్ళిచ్చేది మనకక్కర్లేదు.

చట్టం ఏం చెప్పినా నిష్కర్షగా, కర్కశంగానే ఉంటుంది. ప్రభుత్వం సూక్ష్మంగా సారాంశమే గ్రహిస్తుంది. సమాచార హక్కు చట్టంలో ప్రభుత్వం గ్రహించి మనకందుబాటులో ఉంచిన సమాచారం మనం కోరుకున్నట్టుగాను, చట్టం ఉద్దేశించినట్టుగాను ఉన్నట్లు తోచదు.

**చట్టం ఏం చెబుతోంది**

ప్రతి ప్రభుత్వ శాఖ (పబ్లిక్ అథారిటి)కి సంబంధించిన పత్రాలు, వ్రాత ప్రతులు, ఫైళ్ళు, మైక్రోఫిలిం, మరియే యితర రూపాల్లో ఉన్న సమాచారాన్నైనా అందుబాటులో ఉంచడానికి అన్ని ఏర్పాట్లు చెయ్యాలి అని.

**ఆ ఏర్పాట్లు ఎలా ఉండాలి**

- ప్రతి రికార్డు (అన్ని రికార్డులు) వరుసక్రమంలోను అక్షర క్రమంలోను కంప్యూటర్ నెట్‌వర్క్ ద్వారా దేశం అంతటికి అందుబాటులో ఉంచాలి.
- అంతేకాకుండా, ఆ శాఖ వివరాలు, నిర్వహించే పనులు, విధులు.
- ఆ శాఖలోని అధికారులు, ఉద్యోగుల అధికారాలు, బాధ్యతలు.
- నిర్ణయాలు తీసుకోనే ప్రక్రియ, పర్యవేక్షణ, జవాబుదారీ ఏర్పాట్లు.
- తమ విధులను నెరవేర్చడానికి, నిర్వర్తించడానికి నిర్ణయించుకొన్న ఉద్దేశ్యాలు ఉద్యోగుల విధినిర్వహణకు నియంత్రించే విధి, విధానాలు, ఉత్తర్వులు, ఆదేశాలు, వారు అనుసరించే లేక అధీనంలో ఉన్న నిబంధన కరదీపికలు (మాన్యువల్స్), రికార్డులు.
- ఆ శాఖ అధీనంలో ఉన్న వివిధ పత్రాల వివరణ.
- విధాన నిర్ణయంలోను, అమలులోను ప్రజల సలహా, సంప్రదింపుల ప్రక్రియకి సంబంధించిన వివరాలు.
- ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది సభ్యులుగా ఉన్న సలహా మండలి, సమితి, సంఘం (బోర్డు, కౌన్సిల్, కమిటీ) వంటి వాటి వివరాలు, వాటి సమావేశాలలో ప్రజలు

పాల్గొనే అవకాశం ఉంటే ఆ ప్రక్రియ వివరాలు, ఆ సమావేశాలలో తీసుకున్న నిర్ణయాల వివరాలు ప్రజలకి అందుబాటులో ఉంచడం.

- ఆ శాఖలోని అధికారులు, ఉద్యోగుల వివరాలు.
- వారి జీతభత్యాలు ఇంకా నిబంధనల ప్రకారం నష్టపరిహారం పొందే పద్ధతుల వివరాలు.
- ఆ శాఖకి కేటాయించిన ఆదాయ వ్యయాలు, భవిష్యత్ కార్యక్రమాలు, వాటి కోసం విడుదల చేసిన నిధులకి సంబంధించిన నివేదికలు.
- ఆ శాఖ ఆధ్వర్యంలో అందించిన సబ్సిడీ కార్యక్రమాలు, అందుకోసం కేటాయించిన నిధుల వివరాలు, ఆయా కార్యక్రమాల లబ్ధిదారుల వివరాలు.
- ఆ శాఖ ద్వారా రాయితీలు, అనుమతులు, ఆమోదాలు పొందినవారి వివరాలు.
- ప్రజలు సమాచారాన్ని పొందడానికి అనువుగా లైబ్రరీ లేక రీడింగ్‌రూం ఉంటే వాటి వివరాలు, అవి పనిచేసే వేళల వివరాలు.
- పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లుగా నియమితులైన వారి పేర్లు, వారు నిర్వహించే పదవి, ఇతర వివరాలు.
- మరియే ఇతర సంబంధిత సమాచారం.

వీటన్నింటిని సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన నాటి నుండి నూట ఇరవై రోజుల లోపల ఆయా ప్రభుత్వ శాఖలు ప్రకటించి ప్రచారం చేయాలి.

ఈ చట్టం అక్టోబరు 12, 2005న అమలులోకి వచ్చింది.

గత మూడేళ్ళ కాలంలో (ఎనిమిదేళ్ళ కాలంలో) ప్రభుత్వ శాఖలు ప్రజల అందుబాటులో ఉంచిన సమాచారం, పైన చెప్పిన కొన్ని అంశాలకూ పరిమితమై ఉంది. ఒక శాఖలో ఏ పదవిలో ఎవరున్నారు, వారి జీతభత్యాలెంతలాంటి సమాచారం అవసరం కొంత వరకే. ఆ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అందుకోసం ఖర్చు పెట్టిన ప్రజాధనం సద్వినియోగమయిందా, దుర్వినియోగమయిందా అన్నది ముఖ్యంగా పారదర్శకంగా ఉండాలి. అవినీతి, బంధుమిత్ర ప్రీతి నివారణకి తీసుకున్న శ్రద్ధ అందరికి తెలిసేలా ఉండాలి.

అఫీషియల్ సీక్రెట్స్ చట్టం హేంగ్ ఓవర్ తిక్క వదలని ప్రభుత్వ శాఖలు ప్రజల సమాచార హక్కును అంత త్వరగా ఒంటబట్టించుకోలేవు.

సెక్షన్ నాలుగు సంపూర్తిగా సహ చట్టానికి ఊపిరిలూదితే పరిస్థితి ఎలా ఉంటుందంటే–

ప్రధానమంత్రి కార్యాలయం నిజాయితీగా ఎవరూ అడక్కుండానే జవాబుదారీతనంతో తమ శాఖలో ఎన్ని ఫైళ్ళు కనబడ్డం లేదో, ఎవరి వల్ల కనబడకుండా పోయాయో, వారి మీద తీసుకున్న శాఖాపరమైన క్రమశిక్షణ చర్యల వివరాలు, వగైరా సమాచారాన్ని వారి పోర్టల్‌లో జనానికి అందుబాటులో ఉంచుతారు. కాని వాస్తవ పరిస్థితి – పై సమాచారం కోరుతూ పంపిన దరఖాస్తుని కోర్ట్‌ఫీ స్టాంప్ ద్వారా రుసుం చెల్లించిన కారణాన తిరస్కరించారు. తిరిగి ఇండియన్ పోస్టల్ ఆర్డర్‌తో దరఖాస్తు పంపాల్సి వచ్చింది. ఈలోగా నెల రోజుల సమయం గాల్లో కలిసింది.

జూన్ నెలనుంచి అక్టోబర్‌దాకా పడిన వానల వల్ల ఎన్నిసార్లు హైదరాబాద్ రోడ్లు వేసారో, ఎవరికి ఆ కాంట్రాక్టులు ఇచ్చారో, ఎన్ని సార్లు బిల్లులు చెల్లించారో, ఎంత ఖర్చయిందో, నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేసిన ప్రభుత్వాధికారులెవరో, బాధ్యతా రాహిత్యానికి వారిమీద తీసుకున్న శాఖాపరమైన క్రమశిక్షణ చర్య ఏ విధంగా ఉంటుందో, అటువంటి చర్య తీసుకున్నరో లేదో ప్రజలు అడక్కుండానే ఆ శాఖ సంబంధిత పోర్టల్‌లోనో, ఎలక్ట్రానిక్ రీడింగ్ రూంలోనో అందుబాటులో ఉంచడం తమ బాధ్యతగా గుర్తిస్తారు సంబంధిత మంత్రివర్యులు లేదా కార్యదర్శులు. ఇప్పుడు వారా పనిచెయ్యలేకపోవడానికి కారణం మనం ఊహించలేనిది కాదు.

ప్రస్తుతం తూతూ మంత్రంగాను, నామకార్థంగాను, చేసారా అంటే చేసేమని చేతులు దులిపేసుకొనే పద్ధతిలో సమాచార హక్కు చట్టం అమలవుతోంది. చిత్తశుద్ధితో చట్ట స్ఫూర్తిని చేతల్లో చూపించే ప్రభుత్వం వచ్చినప్పుడే ఈ చట్టం పూర్తి అమలును నోచుకుంటుంది. ■

# కాసుల కక్కుర్తితో గాలికొదిలేసిన రహదారి భద్రత

**- యల్.వి. రామరాజు**



అక్టోబరు నెల 30వ తేదీ మహబూబ్‌నగర్ జిల్లా పాలెం సమీపాన జాతీయ రహదారిపై బెంగుళూరు నుండి హైదరాబాద్ వస్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు దహనమైన సంఘటన, ముందురోజు హైదరాబాదు బాహ్యవలయ రహదారిపై డి.సి.యం. వాహనాల ప్రమాదాలను పరిశీలిస్తే మన రహదారి భద్రత డొల్లతనమెంతో తెలుస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా 2030 సంవత్సరం నాటికి రహదారి ప్రమాదాల వల్ల మరణించే వారి సంఖ్య మొత్తం మరణాలలో 5వ స్థానం ఆక్రమించే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సర్వేలు చెబుతున్నాయి. 31-07-2012న రాష్ట్రాల రవాణాశాఖ మంత్రుల సమావేశం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందజేసిన 2011 సం॥లో జరిగిన ప్రమాదాల వివరాలిలా ఉన్నాయి. 2011 సం॥లో దేశవ్యాప్తంగా 4,97,686 రహదారి ప్రమాదాలు (నిమిషానికి ఒకటి లెక్కన) జరగగా, 1,42,485 మంది చనిపోయారు. 5,11,394 మంది గాయపడటం జరిగింది.

అదే సమావేశంలో రహదారి భద్రత గురించి క్రింద సూచించిన చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

- రాష్ట్ర, జిల్లా స్థాయి రహదారి భద్రతా కౌన్సిళ్ళ ఏర్పాటు.
- జరిమానాల రూపంలో వసూలు చేసిన సొమ్ము నుండి 50 శాతం సొమ్ముతో రాష్ట్ర స్థాయిలో రహదారి భద్రతా నిధి ఏర్పాటు.
- ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించిన చోట్ల, రహదారి వంపులు సరిచేయడం తదితర నివారణ చర్యలు చేపట్టడం.
- నిర్దేశించిన పరిమితికంటే అధిక బరువుతో తిరిగే వాహనాలు, అధికంగా ప్రయాణికులను ఎక్కించుకోవడం, మద్యం త్రాగి వాహనాలు నడిపే వారిపై జరిమానాలను విధించి, క్రిమినల్ కేసులు వేయడం.
- పాఠశాల బస్సులు ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ధృడత్వ పరీక్షలు నిర్వహించడం.
- రహదారుల డిజైన్, భద్రతా అవసరాలు, నిర్వహణ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయడం. జాతీయ, రాష్ట్ర రహదారులకు గుర్తులు ఏర్పాటు.

**మన రాష్ట్ర ప్రభుత్వం 2012 సంవత్సరం రహదారి భద్రత గురించి ఒక ప్రణాళిక విడుదల చేశారు. కొన్ని వివరాలు సంక్షిప్తంగా క్రింద వివరించడమైనది.**

2011 సంవత్సరాంతానికి రాష్ట్రంలో 1.10 కోటి వాహనాలున్నాయి, ప్రతి సంవత్సరం 14% వృద్ధి రేటుతో వాహనాలు పెరుగుతున్నాయి. 42,869 రహదారి ప్రమాదాలు సంభవించగా, 15,165 మంది చనిపోవడం, 55,812 మంది గాయపడటం జరిగింది. ఈ ప్రమాదాలలో 80 శాతం డ్రైవర్ల తప్పిదాల వలన జరుగుతున్నాయి.

**ప్రభుత్వం తీసుకుంటున్నట్లు చెబుతున్న చర్యలు ఈ క్రింద వివరించడం జరిగింది.**

- కాంట్రాక్ట్ కారేజీలుగా త్రిప్పుతున్న వాహనాలలో లగేజి నింపి ప్రయాణీకుల భద్రతకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం.

- పోలీసు అధికారులకు మద్యం త్రాగి వాహనాలు నడిపే వారిపై, రహదారి భద్రతకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకొనే అధికారం.
- ఆటో రిక్షాలను జాతీయ రహదారులపై తిరగకుండ నిషేధం.
- తీవ్రమైన ప్రమాదాలకు కారకులైన డ్రైవర్ల లైసెన్సులు రద్దు.
- ఆధునాతన వేగం కొలిచే యంత్రాలు, మద్యం మోతాదు తెలిపే పరికరాలతో కూడిన వాహనాలను హైదరాబాద్, రంగారెడ్డి, విశాఖపట్నం, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో ఏర్పాటు చేయడం జరిగింది.
- ప్రతి 30-40 కి.మీ. అందుబాటులో ఉండేలా రాష్ట్రమంతా 225 అంబులెన్స్‌లు 108 సర్వీస్ ద్వారా ఏర్పాటు.
- రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రహదారి భద్రత కౌన్సిల్, కలెక్టరు అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ ఏర్పాటు.

ఘనత వహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పేదానికి, చేసేదానికి సంబంధం ఉండటం లేదు. వాస్తవాలు ఇలా ఉన్నాయి. పాలెం దగ్గర జరిగిన దుర్ఘటనలో అతివేగం, రహదారి వంపులో కల్వర్టు ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం. ఎప్పుడో యజమాని మారినా, యాజమాన్యం మార్పు విషయం రికార్డులలో మార్చకపోవడం మన రవాణాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం. హైదరాబాద్ రింగ్‌రోడ్డుపై ఆపి ఉంచిన డి.సి.యం. వాహనాన్ని మరొక డి.సి.యం. ఢీ కొట్టిన సంఘటనలో ముందు వాహనం వెనకభాగంలో ఏ విధమైన గుర్తులు లేనందువలన ప్రమాదం జరిగింది. మన రవాణాశాఖ అధికారులు ఒకే రిజిస్ట్రేషన్ నంబర్‌తో రెండు, మూడు బస్సులు తిరుగుతున్నా లంచాలు మింగుతూ నిద్ర నటిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి డిసెంబరు 2011, మార్చి 2013 రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి జాతీయ రహదారులపై ఉన్న మద్యం దుకాణాలు మూసి వేయాలని కోరుతూ లేఖలు వ్రాసినా చర్యలు శూన్యం. రాష్ట్రంలో ప్రయివేటు బస్సుల యజమానులు ఏదో ఒక రాజకీయ పార్టీలో కొనసాగుతూ నిబంధనలను తుంగలో తొక్కి యిష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ రవాణాశాఖ మాజీ కార్యదర్శి శ్రీ సుందర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నివేదిక ఆధారంగా కేంద్ర మంత్రి వర్గం 2010 మార్చి 15వ తారీఖున జాతీయ భద్రతా విధానాన్ని ఆమోదించినా ఇంతవరకు దానికి చట్టరూపం రాలేదు. ఈ విధానం అమలులోకి వస్తే రహదారి భద్రత కొరకు ప్రత్యేక బోర్డు, ప్రత్యేక నిధి ఏర్పాటైతే కనీసం పాలెం దుర్ఘటన బాధితులకు నష్టపరిహారమైనా దక్కేది.

దుర్ఘటన జరిగిన 10 రోజుల తరువాత మన రవాణాశాఖామాత్యులు శ్రీ బొత్స సత్యనారాయణగారు పత్రికా సమావేశంలో ఘటన తరువాత 601 కేసులు పెట్టామని, 346 బస్సులను సీజ్ చేశామని ప్రకటించి ఆ బాధ్యతను దులిపేసుకున్నారు.

ఇప్పటికైనా ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసి తదుపరి మరిచే పద్ధతి వదిలి క్రింద సూచించిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

అతివేగ నియంత్రణ, రహదారులకు చేరి నివాస ప్రాంతాలున్నప్పుడు ఆ ప్రాంతవాసులు, జంతువులు, వాహనాలు రహదారి దాటడానికి బ్రిడ్జిల ఏర్పాటు, జంతువులు రహదారి పైకి రాకుండా కంచె నిర్మించాలి. అన్ని జాతీయ, రాష్ట్ర రహదారులపై మద్యం అమ్మకాలు జరగకుండ కఠిన చర్యలు చేపట్టాలి. ప్రతి 50-60 కి.మీ.లకు డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా రహదారి నిబంధనలు, భద్రత గురించి పాఠశాల స్థాయిలోనే పాఠ్యాంశంగా ప్రవేశపెట్టి చిన్నప్పటి నుండే అవగాహన పెంచాలి. వాహనాలకు, రహదారులకు సూచికలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రవాణా వాహనాలలో ప్రయాణీకులను ఎక్కించడం, పరిమితికి మించి అధిక బరువుతో తిప్పే వాహనదారులపై కఠిన చర్యలు చేపట్టాలి. లంచాలు మరిగి నిబంధనలను గాలికొదిలేసే సంబంధిత అధికారులను ప్రమాదాలకు బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ■

# చదువుతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలి




చదువుతో పాటు సమాజాన్ని కూడా వైద్య విద్యార్థులు అధ్యయనం చేయలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. మండలంలోని చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కళాశాల ప్రిన్సిపల్ డా॥ ఎన్.వి.ఎస్. చౌదరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగిస్తూ మంచి విద్యాసంస్థను ఏర్పాటు చేసిన ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రవాస భారతీయ వైద్యులను అభినందిస్తున్నట్లు చెప్పారు. మంచి వైద్య కళాశాలగా ఎన్నారై గుర్తింపు పొందిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం చాలా అందుబాటులోకి వచ్చిందన్నారు. టీవీ, ఫోన్ కూడా సరిగా లేని రోజుల్లో తాము చదువుకున్నామని తెలిపారు. ఇప్పుడు విద్యార్థులకు ఆ ఇబ్బందులు లేవన్నారు. ఏ విషయమైన క్షణాల్లో శోధించి తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బట్టీ పట్టడాన్ని పక్కనబెట్టలన్నారు. అధ్యయనం ద్వారా జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఏటా ఇంజినీర్లు 2 లక్షల మంది బయటకు వచ్చినా వారిలో 15 వేల మందికి మాత్రమే ఉద్యోగావకాశాలు వస్తున్నాయని తెలిపారు. దీనికి నైపుణ్యత కొరతే కారణమన్నారు. వైద్య విద్య కేవలం పుస్తకాల్లో చదివేది కాదని అన్నారు. నిరంతరం అధ్యయనం అవసరమన్నారు. యంత్రాలను ఎక్కువగా వినియోగించకుండా జబ్బులను గుర్తించే స్థాయిలో వైద్యులు నైపుణ్య సామర్థ్యాలు పెంచుకోవాలని సూచించారు. లండన్ నగరంలో 75 ఎమ్మారై యంత్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కూడా 72 వరకూ ఎమ్మారై యంత్రాలు ఉన్నాయని చెప్పారు. ప్రజల ఆరోగ్యం క్షీణించినప్పుడే వైద్యుల పని మొదలవుతుంది. కానీ ప్రజారోగ్యం బావుండాలని వైద్యులు కోరుకోవాలని చెప్పారు. ఆరోగ్య రక్షణ వ్యయం క్రమంగా పెరుగుతోందని తెలిపారు. ఇది మంచి పరిణామం కాదన్నారు. 40 ఏళ్ళ క్రితం వైద్యులను దేవుళ్లుగా రోగులు ఆరాధించేవారని, గౌరవించేవారని చెప్పారు. కానీ ఈ రోజుల్లో వైద్యులకు ఆ గౌరవం లేదని చెప్పారు. మంచి నైపుణ్యం పొందినా, ఎన్ని కోట్లు సంపాదించినా చుట్టూ పరిసరాల ప్రభావం కూడా విద్యార్థులపై ఉంటుందని చెప్పారు. కేవలం తాను ఒక్కడినే అభివృద్ధి చెందాలని కాకుండా తనతో పాటు సమాజాన్నీ అభివృద్ధి చేస్తాననే సంకల్పం ఉండాలన్నారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలను రోగులకు అందించాలని సూచించారు. అనంతరం డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ డైరక్టర్లు డా॥ అక్కినేని సుదర్శనరావు, డా॥ మంతెన నర్సరాజు జ్ఞాపికతో సన్మానించారు. ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ డైరక్టర్ డా॥ పిన్నమనేని రామకృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపల్ డా॥ టి.ఎస్.ఆర్.సాయి, ఎన్నారై ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా॥ మస్తాన్ సాహెబ్ తదితరులు ప్రసంగించారు. చదువులో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# 'ఆమ్ ఆద్మీ' విజయంపై లోక్‌సత్తా సంబరాలు

ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మొదటిసారే ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులు గెలవడంపై, అవినీతి వ్యతిరేక దినోత్సవాలను పురస్కరించుకొని నగరంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్ వివేకానంద విగ్రహం వద్ద గ్రేటర్ లోక్‌సత్తా అధ్యక్షులు దోసపాటి రాము ఆధ్వర్యంలో ఆమ్ ఆద్మీ విజయోత్సవ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిమారుత్ మాట్లాడుతూ ఢిల్లీలో ఢిల్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మట్టికరిచి ఆమ్ ఆద్మీ పార్టీ గెలవడం ప్రజాస్వామిక వాదుల, అవినీతిని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేస్తున్న వారి విజయం అని పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచారంలో లోక్‌సత్తా పార్టీ తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించి ఎన్నికల ప్రచారంలో స్వయంగా పాల్గొన్నామని తెలిపారు. ఈ ప్రభావంతో త్వరలో మన రాష్ట్రంలో కూడా లోక్‌సత్తా పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు యువత చైతన్యవై అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి ఈద చెన్నయ్య, మహిళాసత్తా నాయకురాలు గీతామూర్తి, బీసీ నాయకులు ప్రవీణ్, నగరంలోని పలు నియోజకవర్గాల ఇన్‌చార్జులు దిలీప్, సాంబిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భవానీ పాల్గొన్నారు.



# అవినీతి అంతానికి యువత కదం తొక్కాలి

**సికింద్రాబాద్**

యువత రాజకీయాల్లో కీలక పాత్రను పోషించాల్సిన తరుణం ఆసన్నమైందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 'యూత్ మైండ్స్ 2013' పేరిట యువతకు వివిధ అంశాలపై అవగాహన సదస్సును పలు స్వచ్ఛంద సంస్థలు సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించాయి. ఇంజినీరింగ్, ఎంబీఏలతో పాటు వివిధ కోర్సుల విద్యార్థులు, యువతీ యువకులు హాజరైన ఈ సదస్సులో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దిశానిర్దేశం చేశారు. జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తెచ్చే సత్తా యువతలో ఉందన్నారు. సమన్వయకర్త దినేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నిపుణులు తమ అభిమతాలను చాటుకున్నారు.

# "మహిళా సాధికారత సదస్సు" పోస్టర్ ఆవిష్కరణ




ఇంటి ఇంటికి లోక్‌సత్తా కార్యక్రమంలో భాగంగా "మహిళా సాధికారత సదస్సు" పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశంలో 50% మహిళలు ఉన్నప్పటికి వారికి సాధికారత అందటం లేదని లోక్‌సత్తా సనత్‌నగర్ అధ్యక్షురాలు హైమాప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మరి ముఖ్యంగా దిగువ మధ్య తరగతి మహిళలు విద్య లేక, తమ హక్కులను తెలుసుకోలేక ఉన్నారని అన్నారు. ఇటు వారి హక్కులు, ఆరోగ్యం కోసం మహిళా సాధికారత సదస్సులు సనత్‌నగర్‌లోని అన్ని బస్తీలో రానున్న రోజుల్లో విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజీవ్, లావణ్య, కస్తూరి, విమల, జానకిరామ్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలపై లోక్‌సత్తా సంతకాల సేకరణ




రహ్మత్‌నగర్ చౌరస్తాలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లోక్‌సత్తా పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం పార్టీ అధ్యక్షుడు సాంబిరెడ్డి అన్నారు. లోక్‌సత్తా పార్టీ రహ్మత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్యలపై ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ రహ్మత్‌నగర్ చౌరస్తాలో అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం వలన నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వ సేవలలో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాలు సరిగా పనిచేస్తాయన్నారు. ట్రాఫిక్ చలానాల ద్వారా రూ. 41 కోట్లు, వాహనాలపై పన్నుల ద్వారా రూ. 60 కోట్లు, గ్రేటర్ హైదరాబాద్ బడ్జెట్‌లో 4 వేల కోట్లు ఉన్న చిన్నచిన్నక సమస్యలను కూడా అధికారులు పరిష్కరించడం లేదన్నారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించి అధికారులకు వినతిపత్రం సమర్పిస్తామని రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, శ్రీనివాస్, రామకృష్ణ, సుధాశేఖర్, చెన్నమ్మ, శ్రీవాణి, పవన్, కాశిరావు, రాజారామ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గురజాడ ప్రత్యేక "స్టాంపు" విడుదలపై లోక్‌సత్తా హర్షం

**విజయనగరం**

విజయనగరం జిల్లాకే కాదు యావత్తు తెలుగుజాతికే గర్వకారణమైన మహాకవి గురజాడ 150వ జయంత్యుత్సవ ప్రత్యేక తపాల బిళ్లను జాతికి సమర్పించడం హర్షదాయకమని లోక్‌సత్తా పార్టీ స్వాగతిస్తుందని, లోక్‌సత్తా పార్టీ నాయకులు తెలిపారు. గురజాడ స్వగృహాన్ని పర్యాటక కేంద్రంగాను, అదే విధంగా గురజాడ స్మారకార్థం విజయనగరంలో మరియు హైదరాబాద్‌లో ఆడిటోరియంలు నిర్మిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వానికి లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది.

# హైమా ప్రవీణ్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : జేపీ




పేద ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న లోక్‌సత్తా మహిళా నాయకురాలు హైమాప్రవీణ్‌పై పెట్రోల్ చల్లి దాడికి పాల్పడడం నీచమైన చర్య అని లోక్‌సత్తా అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా ఖండించారు. హైమాప్రవీణ్‌పై దాడిని నిరసిస్తూ నిర్వహించిన ర్యాలీలో జేపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామలకుంట గుడిసెవాసుల కోసం న్యాయపోరాటం చేస్తున్న హైమాప్రవీణ్‌పై దాడికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం లోక్‌సత్తా ఎప్పుడు కృషి చేస్తుందన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ శ్యామలకుంట నుంచి లక్ష్మినారాయణ యాదవ్ పార్క్ వరకు జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామలకుంట బస్తి వాసులకు అండగా జేపీ




సంఘటితంగా పోరాడితే దేనినైనా సాధించుకో గలుగుతారని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. శ్యామలకుంటలో గుడిసెలను ఖాళీ చేయవద్దని స్థానికంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ.. పేదలు చేస్తున్న దీక్ష కొనసాగుతోంది. ఈ దీక్షకు మద్దతుగా జేపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్కంపేట డివిజన్ శ్యామలకుంట స్థలం ఎవరిదైనా స్థానికులకే చెందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 14 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. స్థలానికి సంబంధించిన పత్రాలను పరిశీలించి ప్రజల తరపున పోరాడతామని పేర్కొన్నారు. అంతకుముందు వాంబే పథకం కింద నిర్మించిన ఇళ్లు, ప్రస్తుతం ఉన్న గుడిసెలను జేపీ పరిశీలించారు. గత 14 రోజులుగా తమవైపు ఉంటూ మానసిక స్థైర్యం ఇస్తున్నది లోక్‌సత్తా సనత్‌నగర్ వారే అని బస్తీ వాసులు జేపీకి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు హైమాప్రవీణ్, లావణ్య, సీపీఎం నాయకులు చలం, బస్తీ వాసులు రాజు, యాదగిరి, మహేష్, రామకృష్ణ, సృజనమ్మ, గన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గంలో డివిజన్ కమిటీల ఏర్పాటు

## మూసాపేట డివిజన్



మూసాపేటలోని లోక్‌సత్తా పౌర సహాయక కేంద్రంలో కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము సత్తయ్య మరియు ఉపాధ్యక్షులు ఆర్. ఓం శంకర్ ఆధ్వర్యంలో మూసాపేట డివిజన్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. మూసాపేట డివిజన్ అధ్యక్షులుగా తులసిదాస్, ఉపాధ్యక్షులుగా యం.గిరి మోహన్, మహిళాసత్తా ఉపాధ్యక్షురాలుగా యస్.మంగ, కార్యదర్శిగా యం.షణ్ముకరావు, సహాయ కార్యదర్శిగా ఎ.ప్రకాష్, రాయపురెడ్డి హరికిరణ్, పి.ప్రశాంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.వాసు, పి.తిరుమలరావు, వి.రాజేష్, ట్రెజరర్ యస్.ధనుంజయ్‌లను నియమించారు.

## ఫతేనగర్ డివిజన్



లోక్‌సత్తా పార్టీ ఫతేనగర్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని నియమించారు. డివిజన్ అధ్యక్షులుగా ఓ.నరసింహ,ఉపాధ్యక్షులుగా యమ్.యస్.వి.యస్. రామానుజా చారి, యం.ఏ.షఫీ, టి.రాజేష్ మరియు యస్.విజయ, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.సలీమ్, సహాయ కార్యదర్శులుగా గణేష్ ఆచారి, యం.రవీందర్, యన్.డి.అజ్గర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.ఆనంద్‌కుమార్, ఎం.వి.సుబ్బారెడ్డి, గుర్రం ఆదప్పలను, సలహాదారులుగా జి.సి.మహేష్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము సత్తయ, ఉపాధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎన్.శ్రీనివాసన్, నియోజకవర్గ యువసత్తా అధ్యక్షులు రాధేశ్యామ్ ఆధ్వర్యంలో నియమించడమైనది.

# రిజర్వు స్థలాల్లో ఆక్రమణలు తొలగించి ప్రహరీలు నిర్మించాలి




పట్టణంలో పలు ప్రాంతాల్లో ఉన్న రిజర్వు స్థలాల్లో ఆక్రమణలు తొలగించకుండా ప్రహరీలు కట్టడం తగదని వాటిని పూర్తిగా తొలగించి పరిరక్షించాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు వి.అప్పలరాజు, మంగారెడ్డి, డి.మంగరాజు, టి.రమేష్ తదితరులు పురపాలక ఇన్‌చార్జి కమిషనర్ కె.రామ్మోహన్‌రావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. పట్టణంలో 80 అడుగుల రహదారిలో విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రివేళ ఈ రహదారిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, కనుక వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో సమగ్ర కాలువల వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలువలు నిర్మించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో లోక్‌సత్తా నాయకులు ఎల్.శ్రీనివాసరావు, పి.గోపాలకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేకదినోత్సవం సందర్భంగా చర్లలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో డిసెంబర్ 9న సమావేశం జరిగింది. అవినీతి కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ విశృంఖలంగా సాగిపోతున్నది. దీనిని అరికట్టడానికి బలమైన లోకాయుక్త, లోక్‌పాల్ చట్టాలను తక్షణమే తీసుకురావాలని, ఎన్నికల వ్యవస్థను సంస్కరించాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది.




# నూతన కార్యవర్గం ఎన్నిక

లోక్‌సత్తా పార్టీ కర్నూలు నగర నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. ఓంకార్ ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్.జి.శంకర్, ప్రధాన కార్యదర్శిగా గద్వాల వీరన్న, కోశాధికారిగా వజ్జా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా సత్యవాణి, సహ కార్యదర్శి శ్యామసుందర్ రెడ్డిలను ఎన్నుకున్నారు.




# రాష్ట్రంలో సంక్షోభంపై ప్రజా బ్యాలెట్




ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభానికి పరిష్కారం ఎలా అనే విషయంగా నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో లోక్‌సత్తా పార్టీ ప్రజాబ్యాలెట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీధర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయానికి భిన్నంగా జరగుతున్న రాష్ట్ర విభజనపై ఏ పార్టీ ఇంతవరకు ప్రజాభిప్రాయం సేకరించలేదన్నారు. లోక్‌సత్తా పార్టీ ఒక్కటే ప్రజాభిప్రాయం తెలుసుకుని దానిని వివిధ వేదికలపై తెలపాలని నిర్ణయించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో ఏడురోజుల పాటు అన్ని మండలాల్లో జరిగే ఈ ప్రజాబ్యాలెట్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మక్కెన అంకయ్యచౌదరి మాట్లాడుతూ అవినీతి యూపీఏ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు మెజారిటీ ప్రజల అభీష్టానికి భిన్నంగా విభజన చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు సీపీ. బాబురావు, ఎస్‌డి. రసూల్, ఎస్. శ్రీనివాసులు నాయుడు, ఎంఎస్ మణియాదవ్, ఎన్.నరసయ్య, పీవీఎల్ రవి, ఎన్.ప్రసాద్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో లోక్‌సత్తా పార్టీలో చేరిన యువతతో డా॥ జయప్రకాష్ నారాయణ్




ఆసిఫ్‌నగర్‌లో అంబేద్కర్ వర్ధంతి



కూకట్‌పల్లిలో అంబేద్కర్ వర్ధంతి




ఒంగోలులో ప్రపంచ అవినీతి వ్యతిరేక దినం



ఢిల్లీ ఎన్నికల సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీతో లోక్‌సత్తా నాయకులు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on 16th December, 2013



గుంటూరు - NRI వైద్య కళాశాల వార్షికోత్సవంలో
ప్రసంగిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad